అగ్రనేత
తెలుగు దిన పత్రిక
TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :234 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 22-11-2024 | పేజీలు:4 వెల: 2.00

## నవంబర్ చివరికి 370 రైళ్లలో 1000 కొత్త జనరల్ కోచ్‌లు

హైదరాబాద్, భారతీయ రైళ్లు కొత్త లుక్‌ను సంతరించుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు సేవలందిస్తోన్న ట్రైన్స్ కు కొత్త బోగీలు ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ దృష్టి పెట్టింది.ఇందులో భాగంగా 370 రైళ్లకు 1000 కొత్త జనరల్ బోగీలను అమర్చాలని చూస్తుంది. ఈ ప్రక్రియ నవంబర్ నెలాఖరు వరకు పూర్తి అవుతుందని రైల్వే బోర్డు తెలిపింది. ఈ బోగీల ద్వారా రోజుకు లక్ష మంది ప్రయాణికులు ప్రయాణించే ఛాన్స్ ఉందన్నారు. పలు రైళ్లకు ఇప్పటికే 583 జనరల్ కోచ్‌లను ఏర్పాటు చేయగా.. మిగతా రైళ్లకు కోచ్ లను అమర్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు.కాగా, భారతదేశంలోని అన్ని రైల్వే జోన్‌లు, డివిజన్లలో ఈ కోచ్‌లను ఏర్పాటు చేసే ప్రక్రియ వేగంగా జరుగుతుంది. 2025లో హోలీ పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని తాము సన్నాహాలు చేస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. రాబోయే రెండేళ్లలో 10,000 నాన్-ఏసీ కోచ్‌లను ప్రవేశ పెట్టాలని చూస్తున్నాం.. దీని ద్వారా 8 లక్షల మంది ప్యాసింజర్లు జర్నీ చేయవచ్చని రైల్వే బోర్డు పేర్కొంది. మా లక్ష్యానికి అనుగుణంగా ఈ కోచ్‌ల తయారీ చెన్నైలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీల్లో కొనసాగుతోందన్నారు.

# 'బాబ్రీ తీర్పుతో ముస్లిం ప్రార్థనా స్థలాలు లక్ష్యంగా మారాయి'..



హైదరాబాద్,ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మొన్నటికి మొన్న తిరుమల వ్యవహారంపై తీవ్రంగా వ్యవహరించిన అసదుద్దీన్ తాజాగా ఉత్తరప్రదేశ్ సంభాల్‌లోని చందౌసికి చెందిన షాహీ జామా మసీదు కేసుకు సంబంధించి ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. బాబ్రీ మసీదు తీర్పు భారతదేశంలోని ముస్లిం ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకునేందుకు కొందరిని ప్రోత్సహిస్తుందని చెప్పుకొచ్చారు.ఈ విషయమై ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేస్తూ.. 'మసీదును నిర్మించడానికి ఆలయాన్ని కూల్చివేశారంటూ పిటిషన్ వేసిన మూడు గంట్లోనే ప్రాథమిక సర్వేకు సివిల్ జడ్జి ఆదేశించారు. పిటిషన్ వేసిన లాయర్ యూపీ ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా ఉన్నారు. పిటిషన్ వేసిన రోజు సర్వే నిర్వహించారు. బాబ్రీ విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారు. అవతలి వారి వాదన కూడా వినకుండానే కోర్టు ఆదేశాలిచ్చిన గంటలోపే బాబ్రీ తాళాలు తెరిచారంటూ' అసదుద్దీన్ రాసుకొచ్చారు.ఇంతటి వేగాన్ని సాధారణ కేసుల్లో ఎందుకు చూపించరంటూ అసదుద్దీ ప్రశ్నించారు. కోర్టులు ఇలా ఆదేశాలను ఇస్తూ పోతుంటే ప్రార్థనా స్థలాల చట్టం కేవలం చిత్తు కాగితంతో సమానమవుతుంది. ఇలాంటి వ్యాజ్యాలను వెంటనే కోర్టులకు చేరకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకొచ్చారని అసదుద్దీన్ గుర్తు చేశారు. వందల ఏళ్ల నుంచి ప్రార్థనల కోసం ఉపయోగిస్తున్న మసీదులపై.. మతపరమైన ప్రేరేతి వ్యాజ్యాలు వేస్తున్నారన్నారు. న్యాయస్థానాలు వీటిని మొదట్లోనే తుంచి వేయాలని అసదుద్దీన్ డిమాండ్ చేశారు.ఇదిలా ఉంటే.. షాహీ జామా మసీదును సర్వే చేయాలని మంగళవారం కోర్టు ఆదేశించింది. 1526లో అక్కడ ఉన్న ఆలయాన్ని కూల్చివేసి మసీదు నిర్మించారని మహంత్ దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. మసీదును నిర్మించేందుకు ఆలయాన్ని కూల్చివేశారా లేదా అని తెలుసుకోవడానికి మసీదు స్థలంలో ప్రాథమిక సర్వే నిర్వహించాలని కమిషనర్‌గా నియమించిన రమేష్ చంద్ రాఘవ్‌ను సివిల్ జడ్జి ఆదిత్య సింగ్ ఆదేశించారు. నవంబర్ 29వ తేదీలోగా సర్వే నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

# భారత,అమెరికా చట్టాలను గౌతం అదానీ ఉల్లంఘించారు

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు సంస్థ ఓనర్ గౌతం అదానీపై అమెరికా కోర్టులో నేరాభియోగాలు నమోదు అయ్యాయి. న్యూయార్క్ జడ్జి తన ఆదేశాల్లో అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. గౌతం అదానీ.. భారతీయ, అమెరికా చట్టాలను ఉల్లంఘించినట్లు స్పష్టం అవుతున్నదని రాహుల్ ఆరోపించారు. మోదీ, అదానీ కలిసి ఉంటే, ఆ ఇద్దరూ ఇండియాలో క్షేమంగా ఉంటారని రాహుల్ పేర్కొన్నారు. అదానీని తక్షణమే అరెస్టు చేయాలన్నారు. మదహబి పురి బుచ్‌ను ఈ కేసులో విచారించాలన్నారు.ప్రతిపక్ష నేతగా ఈ అంశాన్ని.. లోక్‌సభలో లేవనెత్తుతాని రాహుల్ చెప్పారు. అదానీ నేరాలపై జేపీసీ విచారణ జరిపించాలన్న డిమాండ్ కొనసాగుతుందన్నారు. భారత సర్కారు గౌతం అదానీకి రక్షణగా నిలుస్తోందని, ఆయన్ను అరెస్టు చేయడం కానీ విచారణ చేయడం కానీ జరగదని గ్యారెంటీ ఇస్తున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. గౌతం అదానీ ఎందుకు ఈ దేశంలో స్వేచ్ఛగా విహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రెండు వేల కోట్ల స్కామ్‌తో పాటు ఇతర కుంభకోణాల్లో ఆయన పాత్ర ఉన్నట్లు తెలిసినా ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదని రాహుల్ గాంధీ అడిగారు.దేశంలోని ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారని, కానీ అదానీ మాత్రం పరారీ అవుతున్నట్లు ఆరోపించారు. ఈ



అంశాన్ని ఎన్నాళ్ల నుంచో ప్రశ్నిస్తున్నామని, కానీ గౌతం అదానీని ప్రధాని మోదీ రక్షిస్తున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఈ స్కామ్‌లో ప్రధాని మోదీ పాత్ర ఉన్నట్లు కూడా ఆరోపించారు. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం అధికారులకు ముడుపులు ఇచ్చేందుకు గౌతం అదానీ ప్రయత్నించినట్లు నేరాభియోగం నమోదైంది. ఆ కేసులో అమెరికా కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది.

# కాగ్ అధిపతిగా తెలుగు అధికారి ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ, ప్రతిష్ఠాత్మక భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొండ్రు సంజయ్ మూర్తి చేపట్టారు.కాగ్ అధిపతిగా ఈరోజు (గురువారం) ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించింది. ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్‌మూర్తి అరుదైన రికార్డ్ సృష్టించారు. అమలాపురం మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి కుమారుడు సంజయ్.. 1964 డిసెంబర్ 24న జన్మించారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు ఎన్నికై.. ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. 2021 సెప్టెంబర్ నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా విధులు నిర్వహించారు.ఇక, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం అమలులో సంజయ్ మూర్తి కీలక పాత్ర పోషించారు. ఐఏఎస్ అధికారిగా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ఇక, కొండ్రు సంజయ్ సేవలను గుర్తించిన మోడీ సర్కార్ ఈ కీలక బాధ్యతలు కట్టబెట్టింది. ఈ స్థానంలో నియమితులైనవారు గరిష్ఠంగా ఆరేళ్లు లేదా.. 65 ఏళ్ల వయసు



వరకు కొనసాగే అవకాశం ఉంది. సంజయ్‌మూర్తి తండ్రి కేఎస్ఆర్ మూర్తి 1996లో కాంగ్రెస్ తరఫున అమలాపురం నుంచి లోక్‌సభకు గెలిచారు. అంతకు ముందు ఆయన కూడా ఐఏఎస్ అధికారిగా కేంద్ర సర్కార్ లో కార్యదర్శి స్థాయిలో సేవలను అందించారు.

# అదానీతో అనుబంధం దేశానికే అవమానం.. అరిష్టం



హైదరాబాద్,అదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడని విమర్శించారు.అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం, అరిష్టమన్నారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో అంటూ ప్రశ్నించారు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారంటూ మండిపడ్డారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని.. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత? అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు.గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్‌తో పాటు మరో ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. అదానీ, అనుబంధ సంస్థలు 20 సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొం సోలార్ పవర్ ప్లాంట్ ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వ జూపినట్లుగా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అమెరికాతో పాటు ఇంటర్‌నేషనల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించారని అభియోగాలు మోపారు.అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లను సేకరించినట్లుగా న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకుపైగా సేకరించినట్లుగా ఆరోపించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది.

**విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్.. మహిళలను కోటీశ్వరులను చేస్తాడట**

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్.. మహిళలను కోటీశ్వరులను చేస్తాడట అంటూ మండిపడ్డారు. రోజుకో గురుకుల పాఠశాలలో ఆహారం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనిది గురుకుల పాఠశాల్లో ఇప్పటి వరకు 40 మందికి పైగా విద్యార్థులు మరణించారని చెప్పారు. పిల్లలు పిట్టల్లా రాలుతుంటే దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా వేదికల మీదికెక్కి పిట్టలదొర మాటలు చెబుతున్నాడని విమర్శించారు. తల్లికి బువ్వ పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయించాడట అని ఎద్దేవా చేశారు. దవాఖానల్లో విద్యార్థులు, చెరసాలలో రైతన్నలు, ఆందోళనలో నిరుద్యోగులు.. జాగో తెలంగాణ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# జమిలి ఎన్నికలకు మహారాష్ట్ర చూపిస్తుందా ?



ముంబై:దేశంలో రెండు కీలకమైన రాష్ట్రాలకు బుధవారం పోలింగ్ జరిగింది. జార్ఖండ్ లో 68 శాతానికి పైగా పోలింగ్ జరిగితే మహారాష్ట్రలో బాగానే సాగింది. ఇక ఫలితాలు ఈ నెల 23న రానున్నాయి. అయితే దాని కంటే ముందు వచ్చిన ఎగ్జిట్ పోల్స్ రిజల్ట్ మాత్రం కేంద్రంలో ఎన్డీయే కూటమికి మద్దతుగా ఉండడం విశేషం.అత్యధిక శాతం ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఈ రెండు రాష్ట్రాలలో ఎన్డీయే కూటమి గెలుస్తుందని కచ్చితంగా చెబుతున్నారు. ఏపీలో 164 సీట్లు టీడీపీ కూటమి గెలుచుకుంటుందని అంచనా వేసిన కేకే సర్వే మహారాష్ట్రలో ఎన్డీయే కూటమికి మొత్తం 225 స్థానాలు లభిస్తాయని అంచనా కట్టింది. దాంతో దీని మీద మరింత ఆసక్తి పెరిగింది.ఇక జార?ండులో మ్యాజిక్ ఫిగర్ ని ఎన్డీయే కూటమి దాటేస్తుందని ఎక్కువ సర్వేలు చెప్పాయి. ఇక ఈ రెండు రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలే కనుక 23న అసలైన ఫలితాలలో ప్రతిబింబిస్తే మాత్రం జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోతాయని అంటున్నారు.కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇది అతి పెద్ద బూస్టింగ్ గా ఉంటుందని అంటున్నారు. 2027 మొదట్లో జమిలి ఎన్నికలకు సిద్ధం కావాలని చూస్తున్న బీజేపీ పెద్దలకు ఈ ఎన్నికల్లో ఘన విజయాలు దకితే మాత్రం ఇక నల్లేరు మీద నడకలా జమిలి ఎన్నికలు దూసుకుని వచ్చేస్తాయని అంటున్నారు.ఇక మహారాష్ట్రలో కనుక బీజేపీ నాయకత్వంలోని కూటమి గెలిస్తే మోడీ ప్రభుత్వానికి అది ఎంతో మోరల్ సపోర్ట్ ఇస్తుందని అంటున్నారు. అదే విధంగా జార?ండ్ లో బీజేపీ అత్యధిక కాలం రాజ్యం చేసింది. ఈ దఫా మళ్ళీ గెలుస్తుందని ముందు నుంచి కొంత అంచనా ఉంది.మరో వైపు చూస్తే ఈ రెండు అసెంబ్లీ ఎన్నికల తరువాత వచ్చే ఏడాది ఢిల్లీ, బీహార్ కి ఎన్నికలు ఉన్నాయి. అయితే వాటిని సైతం బీజేపీ గెలిస్తే ఇక తిరుగు ఉండదని అంటున్నారు. ఆ మీదట 2026లో జరిగే యూపీ ఎన్నికలను మాత్రం వాయిదా వేసి 2027 మొదట్లో జరిగే జమిలి ఎన్నికలతో కలిపేస్తారు అని అంటున్నారు.ఇక జమిలి ఎన్నికలు కూడా జరిపించేందుకు బీజేపీ మంచి ముహూర్తాలనే వెతుకుతుందని అంటున్నారు. మహారాష్ట్రలో కనుక ఎన్డీయే గెలిస్తే ఇండియా కూటమికి మరింత ఇబ్బంది అవుతుందని రాజకీయంగా ఆ శిబిరంలో నిరాశ కనిపిస్తుందని అదే బీజేపీకి కావాల్సింది అని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఈ నెల 23న వచ్చే మహా ఫలితాలను చూసిన మీదట జమిలి ఎన్నికల మీద దేశంలోని రాజకీయ పార్టీలు ఫుల్ క్లారిటీకు రావచ్చు అని అంటున్నారు. సో వెయిట్ అండ్ సీ.

# నేను కూడా రాజీనామా చేసి వెళ్ళాలనుకున్నా

హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ వ్యాప్తంగా 8,047 మంది పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారని.. ఇందులో 4,100 సివిల్, 3,685 మంది ఏఆర్ 2,028 కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఉన్నారని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నుంచి హైదరాబాద్ పోలీస్ శాఖకు 1,128 మందిని ట్రైనింగ్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇప్పుడు 747 మంది దీక్షత్ పాసింగ్ అవుట్ పరేడ్ చేశారన్నారు. 3,081 మంది మహిళల కానిస్టేబుల్స్ పోలీస్ శిక్షణ పొందారన్నారు."1992లో నేను ఐపీఎస్ శిక్షణ పొందాను పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. అప్పుడు 80 మంది ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నాం. వర్షం పడుతున్నా పరేడ్ పూర్తి చేశాం" అంటూ ఆనాటి విషయాలను గుర్తుచేశారు సీపీ. శిక్షణ పొంది పోలీస్ శాఖలో 35 ఏళ్లు గడపబోతున్నారని... శిక్షణ పొందిన వారు అకుంటిత దీక్షతో పని చేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలని స్పష్టం చేశారు. పోలీస్ డ్యూటీ అంటే ఒత్తిడితో కూడుకున్నదని ఆయన తెలిపారు.

**పోలీసులకు ముఖ్య సూచన...**

అలాగే పోలీసులకు సీపీ ముఖ్య సూచన చేశారు. పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. "నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్‌లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. 30 ఏళ్ల క్రితం నా ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో వేసుకున్న పోలీస్ డ్రెస్ ఇప్పుడు కూడా వేసుకోగలను. మీరు శిక్షణ పొందిన పేట్లబురుజు ఆర్మ్ రిజర్వ్ ఇన్చార్జ్ డీసీపీ దక్షిణామూర్తిని చూడండి ఎంత ఫిట్‌గా ఉన్నారో. ఫిట్‌గా ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోండి. పోలీసుల జీతాల విషయంలో ప్రభుత్వం ఎక్కువగా పెంచదు. పోలీసులు అవినీతికి పాల్పడకూడదు. ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే. పోలీస్ శాఖలో మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి. పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్



క్రికెట్ మ్యాచ్ లాంటిది. ఒక పరిస్థితిలో నేను కూడా రాజీనామా చేసి వెళ్ళలనుకున్నా. శిక్షణ తీసుకున్నవారు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి" అంటూ సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

**తెలంగాణలో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ 9 నెలల శిక్షణ పూర్తి..**

కాగా.. తెలంగాణా పోలీస్ అకాడమీలో కానిస్టేబుల్స్ నాలుగవ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, పోలీసులు ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్, సివిల్, ఎస్ఏఆర్‌సీపీఎల్, ఐటీ, సీఏఎన్‌పీటీఓ విభాగాలకు చెందిన 8,047 మంది స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ విజయవంతమైంది. ఫిబ్రవరి21, 2024లో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ మొదలైంది. రాష్ట్రంలో మొత్తం 19 ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ జరిగింది. కానిస్టేబుల్ శిక్షణ పొందిన వారిలో 5709 పురుషులు, 2338 మహిళ అభ్యర్థులు ఉన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్‌కు సమగ్రంగా అన్ని అంశాలపై శిక్షణ పూర్తి అయ్యింది. సివిల్, క్రిమినల్, సైబర్ కేసులు, ఎన్‌డీపీఎస్ యాక్ట్, క్రైమ్, సెల్ఫ్ డిఫెన్స్ ఇలా చాలా అంశాలపై ట్రైనింగ్ జరిగింది. కానిస్టేబుల్స్‌లో గ్రాడ్యుయేషన్ 5470 , పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1361 చదివిన వారు ఉన్నారు. ఇందులో టెక్నికల్1755, నాన్ టెక్నికల్ 5505, లా పూర్తి చేసుకున్న వారు 15 మంది ఉన్నారు. నేడు పాసింగ్ ఔట్ పరేడ్ తరువాత తెలంగాణ పౌరుల సేవలో 8,047 మంది కానిస్టేబుల్స్ పాల్గొననున్నారు.

# మాజీ మంత్రి రోజాపై ఏపీ శాప్ ఛైర్మన్ సంచలన వ్యాఖ్యలు..

అమరావతి, మాజీ మంత్రి ఆర్కే రోజాపై సంచలన వ్యాఖ్యలు చేశారు ఏపీ శాప్ (ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) ఛైర్మన్ రవినాయుడు.. ఈ రోజు మీడియాతో మాట్లాడిన ఆయన..పెద్ద అవినీతి తిమింగలం మాజీ మంత్రి ఆర్కే రోజా అని ఆరోపించారు.. ఆడుదాం ఆంధ్ర పేరుతో నిలువు దోపిడీ చేశారని విమర్శించారు.. కేవలం ఎన్నికల స్టంట్స్ కోసం ప్రభుత్వ సొమ్మును దుబారాగా దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు.. రోజా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రలో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించిన ఆయన.. ఓట్ల కోసం 17 ఏళ్లు పైబడిన చిన్నారులకే అవకాశం కల్పించారని మండిపడ్డారు.. అయితే, క్రీడల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఒక్క చిన్న సర్టిఫికెట్ కూడా ఇవ్వలేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు..ఇక, టూరిజం శాఖ మంత్రి అయితే రోజు తిరుమలకు వెళ్లి వందల మందికి దర్శనం చేయిస్తారా..? అని నిలదీశారు రవి నాయుడు.. ఆడుదాం ఆంధ్రలో వేల కోట్ల రూపాయలు చేతులు మారడంపై.. అదే విధంగా.. రోజా తిరుమల దర్శనాలు.. ఈ రెండు అంశాలపై సీఐడీ



విచారణ జరిపిస్తాం అన్నారు.. తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తాం.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.. అంతేకాదు.. రోజాను కచ్చితంగా జైలుకు పంపిస్తాం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ఏపీ శాప్ (ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) ఛైర్మన్ రవి నాయుడు.

## సంపాదకీయం

శుక్రవారం 22-11-2024

### ఏకీకరణతో లక్ష్యం నెరవేరేనా?

దేశంలోని 43 గ్రామీణ బ్యాంకులను 28కి కుదించేందుకు గాను కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 4న గ్రామీణ బ్యాంక్ చైర్మన్లకు, వాటి స్పాన్సర్ బ్యాంక్ ల ఎండీలకు ఈ విషయాన్ని లేఖ ద్వారా తెలియజేసింది. ఒక రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ అనేది ఈ విలీనానికి ప్రధాన ప్రాతిపదిక. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ప్రక్రియ పూర్తికావచ్చు. ఇదే జరిగితే తెలంగాణ రాష్ట్రం మొత్తానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ఏర్పడుతుంది. దాని పేరు 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంక్' అని ఉంటుంది. దేశవ్యాప్తంగా రాష్ట్రం పేరుతో గ్రామీణ బ్యాంకుల పేర్లు మారిపోయాయి. ప్రస్తుతం తెలంగాణలో రెండు గ్రామీణ బ్యాంకులు పనిచేస్తున్నాయి. 18 జిల్లాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మిగతా 15 జిల్లాలకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలందిస్తున్నాయి. ఈ రెండింటికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ బ్యాంక్‌గా వ్యవహరిస్తున్నది. వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ తర్వా త కూడా అవి గ్రామాల్లో తమ శాఖల ను తెరవడానికి ముందుకురాలేదు. స్థాయికి తగ్గ వ్యాపారం లభించక ఇప్పటికే తమ గ్రామీణ శాఖలు నష్టాల్లో ఉన్నాయని కేంద్రానికి అవి మొర పెట్టుకున్నాయి. చివరికి ఆనాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఆర్బీఐ మాజీ గవర్నర్ నరసింహన్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ సూచనల ప్రకారం తక్కువ ఖర్చుతో వాణిజ్య బ్యాంకు విధానాలు, గ్రామీణ ప్రజల అవసరాలు' కలిసే రీతిలో గ్రామీణ బ్యాంక్‌ల రూపకల్పన జరిగింది. గ్రామీణ బ్యాంక్ మూలధనంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 35 శాతం స్పాన్సర్ బ్యాంక్, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాలుంటాయి. అలా బాధ్యతలు, లాభనష్టాలు మోసేందుకు మూడింటి భాగస్వామ్యం అవసరమైంది. 1975లో ప్రథమ గ్రామీణ బ్యాంక్ యూపీలోని మొరాదాబాద్‌లో ఏర్పడింది. 1976లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల చట్టం వచ్చింది. అలా పదేండ్ల కాలంలో దేశవ్యాప్తంగా 196 గ్రామీణ బ్యాంక్‌లు విస్తరించాయి. బ్యాంక్‌ల వ్యాపార లక్ష్యం ఆర్థిక లాభం కాగా, గ్రామీణ బ్యాంక్‌ల లక్ష్యం మాత్రం సామాజిక లాభంగా ప్రభుత్వం గుర్తించిం ది. వాటి నష్టాలను నష్టాలుగా భావించలేదు. రైతులకు, గ్రామీణులకు అవి అందిస్తున్న ఆర్థిక సేవలనే లాభాలుగా పరిగణించింది. అయితే, 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణల రాకతో ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర దృక్కోణం మారిపోయింది. నష్టా ల్లో ఉన్నవి కూడా లాభాల బాట పట్టక తప్పదు. అప్పటికే గ్రామీణ భారతంలో ప్రధాన పరపతి సంస్థగా వేళ్లూనుకున్న గ్రామీణ బ్యాంక్‌ల నిర్వహణ ఖర్చులను తగ్గించాలనుకున్నది. అలా 2004-05లో మొదలైన వీటి సంఖ్య తగ్గింపు ప్రక్రియ దశలవారీగా సాగి 2020-21 నాటికి 196 నుంచి 43కు చేరింది. ఒక రాష్ట్రంలో ఒక స్పాన్సర్ బ్యాంక్‌కు ఒకే గ్రామీణ బ్యాంకు ఉండాలనే నిబంధనతో ఉమ్మడి ఏపీలో ఉ న్న 16 గ్రామీణ బ్యాంకులు 6గా మారాయి. తెలంగాణ విషయానికి వస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అధీనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన శాతవాహన గ్రామీణ బ్యాంక్, నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ గ్రామీణ బ్యాంక్, ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని శ్రీ సరస్వతి గ్రామీణ బ్యాంక్, రంగారెడ్డి జిల్లా గోల్కొండ గ్రామీణ బ్యాంక్ ఉండేవి. విలీన ప్రక్రియలో భాగంగా మార్చి 2006లో ఈ 4 గ్రామీ ణ బ్యాంకులు కలిసి దక్కన్ గ్రామీణ బ్యాంకు ఏర్పడింది. ఆ తర్వాత హైదరాబాద్ జిల్లాను కూడా ఇం దులో కలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2014, అక్టోబర్‌లో బ్యాంక్ పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్చారు. తెలంగాణలోని మిగతా ఐదు జిల్లాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు గ్రామీణ బ్యాంకులున్నాయి. వాటితోపాటు ఏపీలోని శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంకు కలిసి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా ఏర్పడింది. 2016లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ విలీనం కావడంతో తెలంగాణలోని రెండు గ్రామీణ బ్యాంకులకు స్పాన్సర్ బ్యాంక్ ఒక్కటైంది. స్పాన్సర్ బ్యాంక్ పరంగా గ్రామీ ణ బ్యాంక్‌లు కలిపివేస్తున్నందున టీజీబీ, ఏపీజీవీబీలు రెండు కలిసిపోవాలి. కొత్తగా కేంద్ర ప్రభుత్వ రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ప్రతిపాదన తెచ్చినందున తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్, ఖమ్మం, ఉమ్మడి జిల్లాల్లో ఉ న్న ఏపీజీవీబీ శాఖలను టీజీబీలో కలపాలి. అలా కొత్తగా తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంక్' పురుడు పోసుకుంటుంది. ఈ ఏడాది మొదట్లోనే రాష్ట్రానికి ఒక గ్రామీణ బ్యాంక్ అనే ప్రతిపాదనను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెరపైకి తెచ్చినా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీజీవీబీ ఉండటంతో చర్చ ముందుకు సాగలేదు. ఏపీజీవీబీ శాఖలు రెండు రాష్ట్రాల్లో ఉన్నందున ఆ వాటా లెక్కలను రెండు రాష్ట్రాలు కలిసి తేల్చుకోవాలి. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రాష్ట్రానికి చెందిన 15 శాతం వాటా పరిస్థితి తెలుసుకొని ఉండాలి. కానీ, అలా జరగలేదు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ కాబట్టి హన్మకొండలో ఉన్న ఏపీజీవీబీ ప్రధాన కార్యాలయం తరలిపోనున్నది. పైగా ఏపీలోని గ్రామీణ బ్యాంక్‌లకు కెనరా బ్యాంక్ స్పాన్సర్ కానున్నది. ఏపీజీవీబీ వాటాను తెలంగాణలో ఎస్‌బీఐ, ఆంధ్రలో కెనరా బ్యాంకు పంపకాలు చేసుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉన్నది.

# ధాన్యం సేకరణలో ఏటా దగా !



హైదరాబాద్,ఏటా ధాన్యం అమ్మకాల్లో రైతులు నానా యాతన పడుతున్నారు. మద్దతు ధరలను మిల్లర్లు మింగేస్తున్నారు. దళారులు దగా చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. దీంతో అన్నదాతలు అష్టకష్టాలు పడి పండించిన పంటలను అమ్ముకోవడంలో నానా కష్టాలు పడుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఏ ప్రభుత్వం వచ్చినా హడావిడి చేస్తోందే తప్ప రైతులకు అండగా నిలబడి ధాన్యం కొనేలా చేయలేకపోతోంది. కేంద్రం ఏనాడు కూడా సక్రమంగా ధాన్యం కొనేగోళ్లకు సంబంధించిన విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఇకపోతే అన్నదాతల అవసరాలు, అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పంట వేసిన తర్వాత సుమారు 3, 4 నెలల పాటు సమయం ఉంటుంది. కాని ఏటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ముందుచూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా.. ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు. దీనిని పాలకులు చోద్యంగా చూస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణలో జిల్లాకో ఇద్దరు ముగ్గురు మంత్రులు ఉన్నా ఇదే దుస్థితి నెలకొంది. ఎపిలోనూ ధాన్యం మద్దతు ధరల కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. తేమ ఉందనో తాలు ఉందనో ఇబ్బందులు పెడుతున్నారు. దడవాయి లాంటి పద్ధతి ఇక మరింత కృంగదీస్తోంది.ఇలా ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎప్పుడూ అన్యాయమే జరుగు తోంది. ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంటలు చేతికి వచ్చినా సజావుగా కొనుగోళ్లు జరుగుతాయన్న భరోసా లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరపాలని అప్పుడే అక్కడక్కడా ఆందోళనలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు సక్రమంగా వ్యవహరిస్తే ఇలాంటి పరిస్థితి రాదు. కానీ ధాన్యం కొనుగోళ్లపై మాటలే తప్ప స్పష్టత ఇవ్వడం లేదు. పైకి మాత్రం ఆదేశాలు వచ్చాయని హడావిడి చేస్తున్నారు. రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా రైతుల సమస్యలు ఉన్నాయి. వారికి అండగా ఉంటామన్న మాటలే తప్ప చేతల్లో కానరావడం లేదు. ఇప్పుడు ధాన్యం సేకరణ విషయంలో రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. అయినా మార్పు లేదు. గతంలో జాతీయ ధాన్యం సేకరణ విధానం కోసం రైతులు చేసిన పోరాటం కేంద్రంపై రాజకీయ పోరాటంగానే బిజెపి భావించింది. అయినా ధాన్యం సేకరణలో ఓ జాతీయ విధానం అన్నది నేటికీ రూపుదాల్చలేదు. కనీసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అయినా ధాన్యం సేకరణపై స్పష్టమైన విధానాలు అవలంబించేలా చర్యలకు డిమాండ్ చేయాలి. ఒక్క ధాన్యం కొనుగేళ్లే కాదు.. అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. దేశంలో ప్రధాని మోడీ విధానాల కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బతకడానికే కష్టపడుతున్నారు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా ప్రజలకు ఆహారభద్రత దక్కడంలేదు. దేశంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగుతున్నాయి. ఇటీవల బియ్యం ధరలు మళ్లీ పెరిగాయి. సన్నబియ్యం ధరలు ఏకంగా 68కి చేరువయ్యాయి. పెట్రో, డీజిల్, గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెరిగి సామాన్యులు నానాయాతనలు పడుతున్నారు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యాయసాయ దిగుముతలను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని ఆపేయాలి. దేశీయంగా నూనె గింజల ఉత్పత్తికి ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రం పై అన్ని రాష్ట్రాలు కలసి ఒత్తిడి తేవాలి. జాతీయ పంటల విధానం కోసం పోరాడాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటు న్నారే తప్ప ప్రజలను పట్టించు కోవడం లేదు. పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపింది. అయితే ఇందులో ఎవరిది తప్పు..ఎవరిది కరెక్ట్ అన్నది తేల్చాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటిదాకా ఒకే విధానం అమల్లో ఉండడం వల్ల ధాన్యం సేకరణలో మార్పులు చోటు చేసుకోవడం లేదు. రాష్ట్రాలుతమ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నాయని కేంద్ర అధికారులు చెబుతున్నారు. జాతీయవిధానం కావాలంటే అందుకు ప్రత్యామ్నాయంగా ఆయా రాష్ట్రాలను కలుపుకుని పోరాడాలి. వరి కొనుగోళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విమర్శల పర్వం ఇకముందు తగదు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరి తీసుకొని.. రైతులకు భరోసా కల్పించాలి. అనేకచోట్ల మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగు చేస్తున్నారు. పలు జిల్లాల్లో భారీగా ఆరుతడి పంటలను ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జొన్న, మొక్క జొన్న, శనగ, పత్తి తదితర పంటలు సాగయ్యాయి. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, సరిపడా నీటితడులు అందడంతో దిగు బడులు ఆశాజనకంగానే కనిపిస్తు న్నాయి. ప్రతీసారి కొనుగోళ్ల పక్రియ ఆలస్యం కావడంతో సగంపంట దళారుల పాలవుతూనే ఉంది. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదు. . ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు.. బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. దళారులు ఇంటికే వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చివరి నిముషంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ధాన్యం సేకరణపై స్పష్టమైన విధానం అవలంబించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# కేసీఆర్ చేసిన గాయాలకు... రేవంత్ ఆయింట్‌మెంటు?



హైదరాబాద్,తెలంగాణ అంటే రక్త చరిత్ర. తెలంగాణ ఒంటి నిండా గాయాలే. గాయం లేని చోటెక్కడ? తెలంగాణ శరీరం పచ్చి పుండు. నాలుగు దశాబ్దాలుగా భూస్వాముల కారణంగా ఈ నేలపై లేత నెత్తురు ఒలికింది. అది కృష్ణా, గోదావరి మీదుగా ఇంద్రావతి, ప్రాణహిత వైపు ప్రవహిస్తోంది. ప్రతి సందర్భమూ ఒక గాయమే. ప్రతి సంఘటనా ఒక గాయమే. తెలంగాణకు దెబ్బ తినడమూ తెలుసు. కోలుకొని మళ్లీ మర్లబడడమూ తెలుసు. అన్నింటికీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటే 'జిందా తిలిస్మాత్' అనుకున్నాం. కేసీఆర్‌ను బాపూ అన్నాం. తెలంగాణకు మీరే దిక్కు అన్నాం. కానీ అది మన భ్రమ అని తేలడానికి పదేండ్లు పట్టింది.గాయపడ్డ తెలంగాణ 2014 నుంచి కోలుకోగలదని అనుకున్నాం. పొట్ట కొట్టడానికి వచ్చిన వాళ్లను తరిమేస్తానని కేసీఆర్ 2001లో సింహగర్జన చేస్తే నిజమేనని అనుకున్నాం. కేసీఆర్ 2014లో 'కుబుసం' విడుస్తారని ఎవరనుకున్నారు? ఆయన కోస్తాంధ్ర పెట్టుబడిదారుల 'మనిషి' అని ఎట్లా అనుమానిస్తాం? జరగవలసిన డ్యామేజ్ జరిగిపోయింది. తెలంగాణ సాకారానికి కారకులైన వారిని పగబట్టి కాటేస్తారని ఎట్లా ఊహించగలం? గతం ఎప్పుడూ మరమ్మతు కాదు. భవిష్యత్తును ఆయినా సరిగ్గా నిర్మించుకోవాలి.

**అవమానితులను అక్కున చేర్చుకుని..**

తెలంగాణ రాష్ట్రమిచ్చిన కాంగ్రెస్ పార్టీని పదేండ్ల తర్వాత ప్రజలు ఆదరించారు. కేసీఆర్ చేసిన, కేసీఆర్ కారణంగా అయిన గాయాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మందు రాసే పనిలో ఉన్నారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా అవమానాలు గురైన ఉద్యమ కారులను, రాజకీయ వ్యక్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కున చేర్చుకొని కేసీఆర్ చేసిన ఆనాటి గాయాలకు ఔషధపు లేపనాలు రాస్తున్నారు. రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలన్నీ ఉద్యమ శ్రేణులుగా ముందు వరుసలో ఉన్నవారికి ఆకర్షణీయంగా, అభినందనీయంగా మారుతున్నాయి. తాజాగా గద్దర్ కూతురు వెన్నెలను రాష్ట్ర సంస్కృతిక సారథిగా నియమించడం పట్ల గద్దర్‌పై ఉన్న గౌరవాన్ని, అభిమానాన్ని ముఖ్యమంత్రి చాటుకున్నారని చెప్పుకోవచ్చు.

**గద్దర్, కోదండరాంలకు ఘోరావమానం!**

ఆరు దశాబ్దాల ఉద్యమ నేతగా పీడిత తాడిత ప్రజల గొంతుగా మారిన గద్దర్ చివరి దశలో రాజకీయ పార్టీలకు సైతం గొంతుగా మారారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాట ముందు నడిచింది. ప్రతి పాట గద్దర్‌ని అనుసరించినదే.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది. అలాంటి గద్దర్ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తిరిగి మరోసారి ప్రశ్నించే గొంతుగా మారారు. ఇక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వలె క్రియాశీల పాత్ర పోషించిన కోదండరాం సైతం కేసీఆర్ ఎత్తుల ముందు చిత్తయిపోయారు. ఆయనను కనుమరుగు చేసేందుకు కేసీఆర్ అనేక ప్రయత్నాలు చేశారు. ఏ రాష్ట్రం కోసమైతే కోదండరాం తపించి పోయారో అదే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ విధానాలను ఎండగడుతూ పదేళ్లు కొట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోదండరాంకు సముచితమైన స్థానమే లభించింది. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన రేవంత్ రెడ్డి పాలనలో కోదండరాం కీలకంగా మారతారని, రానున్న మంత్రివర్గ విస్తరణలో కోదండరాంకు విద్యాశాఖ పదవి లభిస్తుంది అన్న అభిప్రాయాలు కూడా బలంగా ప్రజల్లో వినిపిస్తూ ఉన్నాయి.

**అందెశ్రీ గీతాన్ని తొక్కిపెట్టారు..**

ఇకపోతే 'జయ జయహే తెలంగాణ' అనే గీతాన్ని తిరిగి రాష్ట్ర అధికార గేయంగా ప్రకటించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కింది. తన ఊపిరినంత ధారబోసి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని తొక్కిపెట్టిన కేసీఆర్ తనను అనేక విధాలుగా గాయపరిచారని అందెశ్రీ చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం అంటే కేవలం ఒక కేసీఆర్ మాత్రమే కనిపించాలన్న దుర్బుద్ధి వల్లనే టీఆర్ఎస్‌లో ఉన్న ఒక సెక్షన్ సాహిత్య రంగం, సాంస్కృతిక రంగాలలో వెలుగుతున్న వారిని, మేధావులుగా ప్రజల్లో నానుతున్న వారిని అణిచివేసే కుట్రలో భాగమే ఒక కోదండరాం, ఒక అందెశ్రీ.. ఒక గద్దర్. ఇలాంటి వారందరి పైనా కుట్ర జరిగిందన్న బలమైన అభిప్రాయం ఉంది. వీటిని గమనించిన రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అలాంటివారిని చేరదీసి ఆరాధించి అందలమెక్కించడం రాజకీయంగా తన రాజకీయ చతురతకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.

**సీఎం వైపు కవులూ, సాహితీవేత్తలూ..**

రేవంత్ 'రెడ్డి' రాజకీయ జిత్తులా.. రణ తంత్రపు ఎత్తులా? వర్గ ప్రేమా..? కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ఆయా శక్తుల నుండి అందిన సహకారానికి కృతజ్ఞత చూపుతున్నారా? ఇవన్నీ ప్రశ్నలే. అధికారం వచ్చిన తర్వాత సమీకరణాలన్ని మారిపోతుంటాయి. కష్టపడ్డ వారెవరు గుర్తు ఉండే అవకాశం లేదు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం కష్టపడ్డ వారిని గుర్తించడంతో పాటు కేసీఆర్ వలన అవమానాలకు గురైన వారిని ఏరి కోరి మరీ గుర్తుపట్టి వారికి పదవులు ఇస్తూ రాష్ట్ర రాజకీయాల్లో ఓ ప్రత్యేక ఆకర్షణీయంగా మారారు. ఇటీవల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె పేరును ఓ కళాశాలకు పెట్టారు. ఐలమ్మ మనవరాలికి అక్కడే రాష్ట్ర మహిళా కమిషన్‌లో సభ్యురాలుగా నియమిస్తూ ప్రకటించి సీఎం సంచలనం లేపారు. ఇలా తెలంగాణ ఉద్యమంలో అనేక త్యాగాలకు ఓర్చిన వారిని అక్కున చేర్చుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమ అభిమానుల అండదండలు పొందుతున్నారు.

**వెన్నెలకు రథసారథ్యం..**

రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన అందరికీ పదవులు ఇవ్వడం సాధ్యం కాదు. ఇది జగమెరిగిన సత్యం. కానీ పక్కనపెట్టి అవమానించడం, గాయపరచడం, కనుమరుగయ్యే విధంగా ప్రవర్తించడం లాంటి విధానాల వల్ల ఉద్యమకారులు చాలా సందర్భాలు తమ నిరసన గళాన్ని విప్పారు. అందులో ప్రధానంగా గద్దర్ వస్తారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం గురించి చెప్పుకోవాల్సి వస్తే కేసీఆర్ కంటే 20 ఏళ్ల ముందే పీపుల్స్ వార్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని గుర్తించింది. ఆ మేరకు సాంస్కృతిక బృందాన్ని ఏర్పాటు చేసి గద్దర్ పాల్గొన్న ప్రతి చోటా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పాటలు పాడారు, మాట్లాడారు. స్వయంగా బెల్లి లలిత ప్రాణాలర్పించారు. కేసీఆర్‌తో కలిసి ధూమ్ దామ్‌లలో గద్దర్ నడిచారు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడానికి గేటు ముందు గేట్ పడిగాపులు కాచారు. గద్దర్ కన్నుమూశాక టీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీళ్లు కాచారు. తిరిగి అసెంబ్లీ ఎన్నికల్లో గద్దర్ కూతురు వెన్నెలను ఓడించారు. అయితే ఎన్నికల రణ రంగంలో నెగ్గడం అసాధారణమని భావించిన కాంగ్రెస్ పార్టీ మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడానికి వెనుకంజ వేసింది.

# ఆక్వా ఎగమతలపై అంతర్జాతీయ ప్రభావం

ఏలూరు,ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగం ఆక్వాదే. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా మొదటి నుంచి రైతులే కష్టనష్టాలను ఎదుర్కొని సాగు చేస్తున్నారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రభుత్వం నామమాత్రం గానే చర్యలు తీసుకుంటుంది. మూడేళ్లుగా రొయ్యల మేత ధరలు పెరుగుతున్న తీరుపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తులు సాధిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా నాయకులకు మాత్రం పట్టడం లేదు. వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వసతుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం ఆక్వా రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు బాగా తగ్గించడం వల్ల మార్కెట్లో రొయ్య ధర దారుణంగా పతనమైంది. విదేశాల నుంచి ఆర్డర్లు లేక ప్రాసెసింగ్ ఎ÷–లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు రొయ్యల నిల్వలతో నిండిపోయాయి. రొయ్యల సాగు ఖర్చు బాగా పెరిగిపోయింది. రూ.లక్షల నష్టాలతో రొయ్య రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జనవరి వరకు ఆగి ఫిబ్రవరి నుంచి పండుగప్ప సాగు చేయాలనే ఆలోచనలో కొంతమంది రైతులున్నారు. ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి. విదేశాలకు ఆర్డర్లు తగ్గడంతో ఆక్వా మార్కెట్ కుదేలైంది. పలు దేశాల్లో రొయ్య దిగుబడులు బాగా వచ్చాయి. దీంతో మన ప్రాంతం నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. మొన్నటి వరకు అధిక వర్షాలు, ప్రస్తుతం చలి వాతావరణం కారణంగా వైరస్‌లు విజృంభించి రొయ్యల దిగుబడులు 50 శాతానికి పడిపోయాయి. ఆర్థికమాంద్యం నేపథ్యంలో యూరోపియన్ దేశాలకు ఎగుమతులు భారీగా క్షీణించాయి. ఎగుమతులు తగ్గడంతో ఆ ప్రభావం రొయ్యల మార్కెట్లపై పడింది.

# టిడిపి వైపు వైసిపి అసమ్మతి నేతల దృష్టి

గుంటూరు,వైసిపిలో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతిని తమకు అనుకూలంగా మలచుకోవాలని అధికార టిడిపి యోచిస్తోంది. ఇంతకాలం జగన్ నాయకత్వానికి ఎదురులేదని అంతా భావించారు. అయితే ఇదంతా పదవులు ఉన్నంత వరకే అన్నది స్పష్టం అయ్యింది. ఆయా జిల్లాల్లో అసమ్మతి సెగలు మెల్లగా బయటకు వస్తున్నాయి. టిడిపి జోరు పెంచడంతో కొందరు అందులో చేరుతున్నారు. రేపు పదవి రాదు..జగన్ మళ్లీ అధికారంలోకి రాడనుకున్న వారు ఇప్పటి నుంచి తమవంతు ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.. అలాంటిదేమీ లేదని నాయకులు ప్రకటించుకున్నా.. రాజకీయాల్లో ఇదంతా సమజంగానే చూడాలి. ఆయా జిల్లాల్లో ఉన్న నేతల గురించి టిడిపి ఆరా తీస్తోందని సమాచారం. మరోవైపు అసంతృప్తితో ఉన్న వారి దారెటన్నది ఇప్పుడు చర్చిస్తున్నారు.

# ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నా

అమరావతి,గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విజయాన్ని తాను ఎన్నడూ మరిచిపోనని, ఏపీ చరిత్రలో ఎప్పుడూ చూడని ప్రజాతీర్పు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల తిరుగుబాటు కనిపించిందని తెలిపారు. "నాలుగు దశాబ్దాలుగా నన్ను ఆదరించారు. అందరికంటే ఎక్కువ సార్లు నన్ను ప్రజలు సీఎం చేశారు. ఎన్నో ఇబ్బందులు పెట్టారు.. జైలుకు కూడా పంపారు. బాంబు దాడి నుంచి శ్రీవారే నన్ను కాపాడారు. నేను ఏ తప్పూ చేయలేదు. సీఎం అయ్యాక రాష్ట్రాన్ని బాగు చేస్తారా.. చేయగలుగాతాము అనే నమ్మకం ఉందా అని పలువురు నన్ను అడిగారు. నేను పారిపోను.. పారిపోలేను. అధికారం ఉన్నా.. అధికారం లేకపోయినా ప్రజల కోసమే పనిచేశాను. ఇప్పుడు కూడా ప్రజలు తీర్పు ఇచ్చి నన్ను గెలిపిస్తే.. అభివృద్ధి చేసి తీరుతాను అని ప్రతిజ్ఞ చేసి ముందుకు వచ్చాను" అని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాత్రికి రాత్రి ఏదీ జరిగిపోదన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్‌పైకి వెళ్లిందన్నారు. కీలక సమయంలో ప్రజలు ఘన విజయం అందించారని చెప్పారు. ఢిల్లీలో పరపతి పెరిగిందని.. కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందన్నారు. 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు రూ.4వేలకు పెంచామని చెప్పారు. విజయవాడ వరదల సమయంలో సీఎం సహాయనిధికి రూ.500 కోట్లు విరాళంగా వచ్చాయన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు శాపాలుగా మారాయన్నారు. ఎంత తవ్వితే అన్ని తప్పులు బయటపడుతున్నాయన్నారు. వైసీపీ అప్పులతో ఏపీ వెంటిలేటర్‌పైకి వెళ్లిందని విమర్శించారు. వైసీపీ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని.. అప్పులపై లెక్కలతో సహా అసెంబ్లీలో చూపించామని అన్నారు. "వైసీపీ పాలనలో నా కుటుంబంపై ఆరోపణలు చేశారు. అధికారం కొత్త కాదు.. కేంద్ర రాజకీయాలు నాకు కొత్త కాదు. రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో సంక్షేమం మొదలుపెట్టాం. రూ.30 తో మొదలైన పెన్షన్... ఇప్పుడు రూ.4 వేలు చేశాం" అని అన్నారు. పేదల కోసం అనేక సంస్కరణలు, పథకాలు తీసుకొచ్చామని వెల్లడించారు. సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత టీడీపీదే అని అన్నారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో 120 సంక్షేమ పథకాలు ప్రారంభించామని తెలిపారు. ఏపీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం తనకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు పూర్తి అయ్యిందని.. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేసిన పనులు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిక్షణం ప్రజల కోసమే పరితపిస్తా అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 101 అన్నా క్యాంటీన్‌లు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని సీఎం తెలిపారు. బెజవాడలో వరద సమయంలో రూ.500 కోట్ల విరాళాలు వచ్చాయని.. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు కూడా స్పందించారన్నారు. ఏపీలో బుక్ చేసుకున్న వారందరికీ గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను వేసింది కానీ.. చెత్త ఎత్తలేదని విమర్శించారు. ఏపీలో 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పెరుకుపోయిందని తెలిపారు. "మేం చెత్తపన్ను రద్దు చేశాం.. చెత్తను తీయిస్తున్నాం" అని తెలిపారు. అమరావతి కొనసాగి ఉంటే రాష్ట్రానికి ఆదాయం వచ్చేదని.. అయినా కూడా అమరావతికి పూర్వవైభవం తీసుకువస్తామని స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆకర్షించడానికి చేయాల్సిన పనులు చేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో రోడ్లన్నీ గుంతలు పెట్టి వెళ్లారని మండిపడ్డారు. గ్రామాల్లో ఉండాలంటే ప్రజలకు కూడా విరక్తి పుట్టే పరిస్థితి వచ్చిందన్నారు. రోడ్ల గుంతలు పూడ్చడానికి రూ.860 కోట్లు విడుదల చేశామన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు తయారుచేస్తామని వెల్లడించారు. రోడ్ల నిర్మాణానికి వినూత్న ఆలోచనలతో ముందుకెళ్తున్నామన్నారు.

# తెలుగు జాతి ఉన్నంత వరకు టీడీపీ ఉండాలి

చెన్నై, తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ఉండాలని ఆ పార్టీకి చెందిన విజయనగరం ఎంపీ, అండమాన్, తమిళనాడు సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జ్ కలిశెట్టి అప్పలనాయుడు ఆకాంక్షించారు. చెన్నై టీడీపీ విభాగం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అన్నానగర్ టవర్ క్లబ్‌లో ప్రారంభించింది. ఇందులో ఎంపీ కలిశెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు.చెన్నై టీడీపీ ఫోరం సభ్యులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, గత ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించారని ప్రశంసించారు.నగరంలోని ప్రజలను చైతన్యవంతుల్ని చేసి పార్టీ సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. టీడీపీలో కార్యకర్త అయిన తనను పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ గుర్తించి, విజయనగరం ఎంపీ స్థానాన్ని తనకిచ్చారన్నారు. పార్టీ మనకు ఏం ఇచ్చిందని కాకుండా, పార్టీకి మనం ఏం చేశామన్నది ముఖ్యమన్నారు. తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్ఠలు మరింతగా పెరిగేలా చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తారన్నారు.

సామాన్య ప్రజలకు అండగా ఉంటాం: చంద్రశేఖర్

చెన్నైలోని సామాన్య తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒక వారధిగా ఉంటూ సామాజిక బాధ్యతతో కృషి చేస్తామని చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. చెన్నై నగరంలో అనేక మంది తెలుగు ప్రజలు ఉన్నత స్థితిలో ఉండగా, మరికొందరికి రాజకీయ పలుబడి ఉందన్నారు. కానీ, కింది స్థాయిలో సామాన్య తెలుగు ప్రజలకు ఏదైనా సమస్య వస్తే, దాన్ని పరిష్కరించేవారు, సాయం చేసేవారు లేరన్నారు. ఇలాంటి సమయంలో తాము పార్టీపరంగా కాకుండా, ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ప్రారంభించి సాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. చెన్నై నగరంలోని ప్రతి ఒక్క తెలుగువారు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించాలని, టీడీపీ గుర్తింపు కార్డు కలిగివుండటం ఒక గౌరవంగా, హక్కుగా భావించాలన్నారు. పార్టీ మనుగడ సాగించాలంటే కేవలం కార్యకర్తలు ఉంటే సరిపోరని, ఆర్థిక వనరులు కూడా ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ పార్టీకి విరాళాలివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

అండమాన్‌లో డిసైడింగ్ ఫ్యాక్టర్: మాధవ నాయుడు

అండమాన్‌లో టీడీపీ ఒక డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా మారిందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు అన్నారు. గతంలో అక్కడ టీడీపీ ఏ పార్టీకి మద్దతిస్తే ఆ పార్టీ అభ్యర్థి గెలిచారని గుర్తు చేశారు. అలాగే, చెన్నైలో టీడీపీని అభివృద్ధి చేయాలని ఆయన ఖ్షిప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు రామాంజనేయులు, మన్నూరు చలపతి, టీటీడీ స్థానిక సలహా మండలి మాజీ సభ్యుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నేత కనకాల నిర్మలమ్మ తన పింఛను డబ్బుల నుంచి పార్టీ నిధికి రూ.2 లక్షలు, మన్నూరు చలపతి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు.

## చిల్లరగా మాట్లాడుతున్న రేవంత్

వరంగల్, సీఎం అనే విషయాన్ని మరిచిపోయి రేవంత్ రెడ్డి చిల్లరగా, చీటర్‌గా మాట్లాడుతున్నారని విమర్శలు మాజీ మంత్రి,బిఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు చేశారు.తెలంగాణ కోసం రేవంత్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని దయాకర్ రావు ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో టిడిపి ఎమ్మెల్యేలందరం రాజీనామా చేస్తే... రేవంత్‌రెడ్డి తప్పించుకొని తిరిగారని ఆరోపించారు. రేవంత్ మినహా తామంతా టీడీపీలోనే ఉంటూ తెలంగాణ కోసం చంద్రబాబుపై పోరాటం చేశామని గుర్తు చేశారు. ప్రజా విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. అబద్ధాలు, మోసాలు, తప్పుడు ప్రమాణాలతో అధికారంలోకి వచ్చారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. హనుమకొండలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దయాకర్ రావుతోపాటు బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. కాళోజీ నారాయణరావు గురించి గొప్పలు చెప్పే రేవంత్ రెడ్డి ఏ రోజైనా కలిశారా, పరిచయం చేసుకున్నారా అని నిలదీశారు. ఉద్యమం కోసం అనేకసార్లు కాళోజీని కేసీఆర్ కలిశారని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే బాబ్లీ ప్రాజెక్టుపై టిడిపి ఎమ్మెల్యేలు అప్పట్లో పోరాడితే రేవంత్ రెడ్డి తప్పించుకుని వచ్చారని గుర్తు చేశారు. ఎర్రబెల్లి దయాకర్ రావు రాక్షసుడు అంటూ రేవంత్ మాట్లాడారని,ప్రజల కోసం, ప్రజల అవసరాల కోసం పోరాడే రాక్షసుడని కౌంటర్ ఇచ్చారు. ప్రజల కోసం దేనికైనా తెగిస్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో కేసీఆర్ తర్వాత వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి దయాకర్ అని అన్నారు. రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచి తరిమిస్తే రంగారెడ్డి జిల్లాలో పోటీ చేశారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, హరీష్, కేటీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సంవత్సర కాలంలో మహిళల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని దయాకర్ రావు డిమాండ్ చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయడం పక్కన పెడితే రేవంత్ బంధువులు కోటీశ్వరులు అవుతున్నారని ఆరోపించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఏమి అమలు చేశారో చెప్పాలన్నారు. మహిళలకు 2500 నగదు, తులం బంగారం ఏమైందని అన్నారు. రేవంత్ రెడ్డి ఒక గంజాయి మొక్క అని దాన్ని పీకేయడానికి కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతు న్నారని కామెంట్ చేశారు. ప్రజా విజయోత్సవ సభకు ఎంతమంది మంత్రులు వచ్చారు అని దయాకర్ రావు గుర్తు చేశారు. సభకు మంత్రులతోపాటు స్థానిక ఎమ్మెల్యే మాధవరెడ్డి రాలేదని అన్నారు. కాంగ్రెస్ నేతలను రేవంత్ రెడ్డి పట్టించు కోవడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ల్యాండ్ మాఫియా అని మండిపడ్డారు. సోనియా గాంధీని బలిదేవత అన్న రేవంత్ ఇప్పుడు అమ్మ అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సభ ఒక వంచన సభ అని మాజీ స్పీకర్ మధుసూదనాచారి మండిపడ్డారు. నాలుగు లక్షల 25 వేల కోట్లు అప్పు చేసిన కేసీఆర్ వనరులు సృష్టించారని అన్నారు. రేవంత్ రెడ్డి 11 నెలల కాలంలో 85 వేల కోట్లు అప్పు చేశారని ఇలా అప్పు చేసి ఏ పథకాన్ని అమలు చేయకుండా చరిత్రలో మిగిలిపోతారని అన్నారు. రేవంత్ రెడ్డి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిందన్నారు. వరంగల్ సభతో రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని అన్నారు. రేవంత్ రెడ్డి అన్నట్టు కొడంగల్‌లో కాంగ్రెస్ నేతలను రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులను అధికారులను ప్రజలు తొక్కుతున్నారని పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి అహంకారంతో వ్యవహరిస్తు న్నారని రాణి రుద్రమ, సమ్మక్క సారలమ్మ పౌరుషంతో మహిళలు తిరగబడతారని చెప్పారు. అల్లుడు కోసం ఫార్మసిటీ, అన్నదమ్ముల కోసం ఫోర్త్ సిటీ కట్టబెట్టారని రెడ్డి ఆరోపించారు. అదానితో కుమ్మక్కై వియ్యంకునికి ప్రాజెక్టులు కట్టబెడుతున్నారాన్నారు.

## జూలూరుపాడులో నిలిచినపోయిన పత్తి కొనుగోళ్లు

భద్రాద్రి కొత్తగూడెం, ఆరుగాలం కష్టపడి పంటలు పండించి మార్కెట్‌కు తీసుకొస్తే అధికారులు కొనుగోళ్లు నిలిపివేయడంపై రైతన్నలు కన్నెర్ర చేశారు. వ్యాపారుల తీరును నిరస్తూ ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు వ్యవసాయ ఉప మార్కెట్‌లో వ్యాపారులు పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో అధికారులు, వ్యాపారుల నిబంధనలను నిరసిస్తూ రైతులు ఆందోళనబాట పట్టారు. జూలూరుపాడు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఈ నగరానికి ఏమైంది?



న్యూఢిల్లీ,విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వాలు అచేతనంగా వ్యవహరిస్తున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకుని పరిస్థితిని గాడిలో పెట్టడం మన దేశంలో సర్వసాధారణంగా మారింది. దేశ రాజధాని ఢిల్లీలో పెచ్చుమీరుతున్న వాయు కాలుష్యం విషయంలోనూ ఇప్పుడు అదే జరుగుతోంది. నెపాన్ని కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టివేసేందుకు ఢిల్లీలోని ఆప్ నాయకత్వంలోని రాష్ట్రప్రభుత్వం, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందంటూ రాష్ట్రప్రభుత్వాన్ని తెగనాడుతూ కేంద్ర ప్రభుత్వం కాలం వెళ్లబుచ్చుతున్నాయి. పాలక పక్షాల మధ్య సయోధ్య కొరవడటం సామాన్యుడి ప్రాణం మీదకు తెస్తోంది. గాలిలో ప్రాణాంతక కాలుష్య కారకాల స్థాయిని తూచే పిఎం 2.5 సూచీ అత్యధిక స్థాయికి చేరిందని పలు నివేదికలు గగ్గోలు పెడుతున్నాయి.ఈ నేపథ్యంలో.. వాయు నాణ్యత సూచీ 300 దాటేవరకూ మనం ఎదురుచూడాలా? అంటూ సర్వోన్నత న్యాయస్థానం కన్నెర్ర చేసింది. గాలి నాణ్యతను పెంచేలా నిబంధనలు అమలులోకి తీసుకురావాలంటూ దాఖలైన ఓ పిటిషన్‌ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు తమకు చెప్పకుండా నిబంధనలను సడలిస్తే సహించబోమంటూ హెచ్చరించింది. దీంతో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌ను అమలులోకి తీసుకువచ్చింది. ట్రక్కులను నగరంలోకి ప్రవేశించకుండా నిషేధం విధించడం, ఉద్యోగుల్లో సగం మంది మాత్రమే విధులకు హాజరయ్యేలా చూడటం, స్కూళు ,కాలేజీల్లో కొన్ని తరగతులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేయడం, భవన నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపివేయడం వంటివి ఈ కార్యాచరణ ప్రణాళికలో భాగం. ఇవన్నీ ఉపశమనం కలిగించేవే తప్ప సమస్య శాశ్వత పరిష్కారానికి దోహదపడవన్న విషయం సుస్పష్టం.తాజాగా వాయు నాణ్యత సూచీ 500కు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. కాలుష్యం కాటుకు వృద్ధులు, చిన్నారులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. అయితే యుక్తవయసులో ఉన్నవారి ఊపిరితిత్తులూ దెబ్బతింటున్నాయంటూ వస్తున్న వార్తలు కలవరం కలిగిస్తున్నాయి. ప్రజలు కాలుష్య రహితమైన స్వేచ్ఛా వాతావరణంలో జీవించే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వాలకు రాజ్యాంగపరమైన బాధ్యత అని సుప్రీం కోర్టు పేర్కొనడం ముమ్మాటికీ నిజం. ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో పంట వ్యర్థాల దహనం తగ్గుముఖం పట్టగా, బిజెపి పాలిత హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో మరింత పెరిగిందంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ నెపాన్ని కేంద్రప్రభుత్వంపైకి నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రంలోని బిజెపి పెద్దల ధోరణి కూడా ఇందుకు ఏమాత్రం తీసిపోలేదు.పాలకుల చేతగానితనాన్ని గ్రహించిన ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో స్వీయరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఫలితంగా దేశ రాజధానిలో ఎయిర్ ప్యూరిఫయర్లు, మాస్కుల అమ్మకాలు జోరందుకున్నాయి. వీటిని కొనలేని, రోడ్డు పక్కన గుడిసెల్లో, మురికివాడల్లో నివసించే పేదప్రజానీకం పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ పాలకులను ఉద్దేశించి 'ఈ నగరం ఇంకా దేశ రాజధానిగా కొనసాగాలా?' అంటూ ప్రశ్నించడం సహేతుకమైనదే.ఒక విధంగా శశిథరూర్ వ్యాఖ్యలు సామాన్యుడి మనోభావాన్ని ప్రతిఫలిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. వాహన కాలుష్యాన్ని నియంత్రించే చర్యలలో భాగంగా ఢిల్లీలో ఎన్నో ఏళ్లుగా సిఎన్‌జి వాహనాల వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇదే క్రమంలో విద్యుత్ వాహనాల వాడకాన్ని పెంచేందుకు వీలుగా రోడ్డు, రిజిస్ట్రేషన్ పన్నుల్లో మరిన్ని రాయితీలు ఇవ్వడం అవసరం. సౌర విద్యుత్ వినియోగాన్ని సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించాలి. ఒకప్పుడు చైనాలోని షాంఘై, బీజింగ్ నగరాల ప్రజలు కాలుష్యం కోరలకు చిక్కి విలవిల్లాడేవారు.తదనంతర పరిణామాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఆ నగరాల్లో కాలుష్యం స్థాయులు చెప్పుకోదగిన రీతిలో దిగివచ్చాయి. కాలుష్యం కాటుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చెక్ చెప్పే దిశగా కార్యాచరణ రూపొందించాలి. పల్స్ రేడియో వేవ్ టెక్నాలజీ సహాయంతో గాలి నాణ్యతను పెంచేందుకు బెంగళూరుకు చెందిన ఒక స్టార్టప్ కంపెనీ రూపొందించిన పరిజ్ఞానం అక్కరకొస్తుందేమో పాలకులు పరిశీలించాలి. అలాగే ఢిల్లీ ఐఐటి నేతృత్వంలో పుణెకు చెందిన ఓ సంస్థ గాలిలోని కాలుష్య కణాలను తగ్గించే పరిజ్ఞానాన్ని రూపొందించినట్లుగా ఆ మధ్య వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆ పరిశోధనపైనా దృష్టి సారించాలి. ఒకవైపు ఉపశమన చర్యలు చేపడుతూనే, వాయు కాలుష్యాన్ని శాశ్వతంగా తుడిచిపెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా ఉమ్మడి పోరుకు ఉపక్రమించాలి.

# పాఠశాల విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించాలంటే..

హైదరాబాద్,2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పాఠశాల విద్యపై బడ్జెట్లో నిధుల కేటాయింపు గతం కంటే పెరిగాయి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య గణనీయంగా పెరిగింది. మౌలిక సదుపాయాల కల్పనలో చెప్పుకోదగిన అభివృద్ధి కనిపించింది. స్టాఫ్ చొరవ, నిరంతర ప్రయత్నాల వల్ల పాఠశాల మానేయడం వంటి సమస్యలు కొంత మేరకు తగ్గుమొహం పట్టాయి. అయితే ముఖ్యంగా అణగారిన సమూహాలలో, ఎస్సీ, ఎస్టీ, బాలికలు, అంగవైకల్యమున్న విద్యార్థులలో ఈ డ్రాపౌట్స్ ప్రధాన సమస్యగా కొనసాగుతుంది. ఇందుకు ఇటీవల యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) తెలంగాణ విద్యా విభాగం, విద్యా మంత్రిత్వ శాఖ నుండి లభించిన నివేదికలలో డేటాను ఉపయోగించి పరిష్కారాలు సూచించాను.



బడి మానేయడానికి కారణాలు..

సామాజిక-ఆర్థిక అసమానతలు, దారి ద్ర్యం తెలంగాణ విద్య విభాగం 2023 నుండి వచ్చిన డేటా ప్రకారం రాష్ట్రంలో 29.4 శాతం మందికి ఆర్థిక సమస్యలే పాఠశాల మానేయడానికి ప్రధాన అవరోధంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో బడి మానేయడం సుమారు 35 శాతానికి చేరుకుంది. ఎస్సీ, ఎస్టీ సమూహాలు ప్రత్యేకంగా ఈ సమస్యలతో ప్రభావితమవుతాయి. ఇక సాంస్కృతిక ప్రమాణాలు తెలంగాణ మహిళా కమిషన్ 2022 నివేదిక ప్రకారం, అణగారిన సమూహాలకు చెందిన అమ్మాయిలలో 14.8 శాతం మంది మధ్యంతరంగా పాఠశాల విద్య పూర్తి చేయకముందే బడి మానేస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఎన్.ఎఫ్.హెచ్.ఎస్ డేటా ప్రకారం, అమ్మాయిలలో 30 శాతం మంది చిన్న వయసులో వివాహం, ఇంటి బాధ్యతలను కారణంగా మానేశారు. 12 శాతం మంది భద్రత, దూరాన్ని కారణంగా చూపించారు. ఇక 2022లో తెలంగాణ రాష్ట్ర విద్యా నివేదిక ప్రకారం, 42 శాతం గ్రామీణ పాఠశాలలు అమ్మాయుల పాఠశాలల్లో పనిచేసే శౌచాలయాలు కలిగి లేవని ఇందువల్ల 21.6 శాతం అమ్మాయిలు బడి మానేయడానికి కారణమవుతుందని తెలిపింది. అలాగే సుమారు 18 శాతం పాఠశాలల్లో అంగవైకల్యమున్న విద్యార్థుల కోసం పాఠశాలల్లో యాక్సెస్ ర్యాంపుల సదుపాయాలను కలిగి లేవని తద్వారా అంగవైకల్యమున్న విద్యార్థుల డ్రాపౌట్స్ 50 శాతం కంటే ఎక్కువయ్యాయని తెలిపింది.

తగిన ప్రమాణాలు లేని కారణంగా..

ఇక నేర్చుకునే విద్యలో లోటుపాట్లు అకడమిక్ సవాళ్లు ఒక రకంగా డ్రాపౌట్స్‌కి కారణమవుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. జాతీయ సాధన సర్వే 2021 ప్రకారం, తెలంగాణలో 5వ తరగతి నుండి 8వ తరగతుల్లో ఉన్న విద్యార్థులలో 39 శాతం మంది విద్యార్థులు గ్రేడ్‌కి తగిన ప్రమాణాలు కలిగిన చదువు లభిం చటం లేదని ముఖ్యంగా గణితం నైపుణ్యాలను కలిగి ఉండటం లేదని తెలి పింది. కొవిడ్-19 తరువాత అకడమిక్‌గా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల మధ్య డ్రాపౌట్ సంఖ్య 16 శాతం పెరిగిందని, ఇక గ్రామీణ తెలంగాణలో యూనిసెఫ్ 2021 నివేదిక ప్రకారం, గ్రామీణ విద్యార్థుల్లో 27 శాతం మంది లాక్‌డౌన్ తరువాత పాఠశాలకు తిరిగి రాలేదని పరిమిత డిజిటల్ యాక్సెస్ ఈ సవాళ్లను మరింత పెంచిందని తెలపింది. ఇక బడి మానేసిన ఎస్సీ, ఎస్టీ పిల్లల్లో 41 శాతం మంది అనధికార కార్మిక లేదా తక్కువ వేతన ఉద్యోగాలలో పనిచేస్తున్న వారు ఉన్నారు. 9 శాతం మాత్రమే తదుపరి వృత్తి లేదా నైపుణ్య ఆధారిత శిక్షణను కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ పథకాల కారణంగా..

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ స్కీమ్‌ల మూలంగా తెలంగాణలో బాల్య వివాహాల సంఖ్య తగ్గింది. డ్రాపౌట్ల రేట్లపై కూడా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపించింది. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల రేట్లను 12 శాతం తగ్గించడంలో సహాయపడింది. అయితే నిపుణులు దీన్ని అమ్మాయిలకు విద్యను కొనసాగించటానికి ప్రోత్సాహకంగా ఈ పథకాన్ని విస్తరించాల్సిందిగా సూచిస్తున్నారు. అలాగే తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ విస్తరణ తరువాత ఒక లక్షకు పైగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు లాభం చేకూరింది. అయితే ఇది ఇంకా ఎక్కువ మందికి అవకాశం కల్పించాల్సి ఉంది. ఇక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల చర్యలకు చేపట్టిన 'మన ఊరు- మన బడి' పథకం ద్వారా 1200లలో మౌలిక సదుపాయాలు మెరుగుపడినప్పటికీ ఇంకా మారు మూల ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాలు మెరుగుపడాలి.

డ్రాపౌట్లను తగ్గించడానికి..

పాఠశాలల్లో డ్రాపౌట్లను తగ్గించేందుకు అణగారిన విద్యార్థులకు ఆర్థిక సహాయంగా ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను పెంచి సకాలంలో విద్యార్థులకు అందించాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను విస్తరించాలి. సామాజిక చైతన్యంతో విద్యార్థుల సంఖ్య నమోదు, రిటెన్షన్ మెరుగుపడుతుంది. ముఖ్యం గా అమ్మాయిల కోసం, తల్లిదండ్రులు, స్థానిక నాయకులను చేర్చే కార్యక్రమాలు డ్రాపౌట్ రేట్లను సుమారు 15 శాతం వరకు తగ్గించగలవని స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ తెలిపింది. విద్యా కార్యక్రమా లు, బ్రిడ్జ్ కోర్సులు, అకడమిక్ లోటుల ను పరిష్కరించాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీకి యాక్సెస్‌ను మెరుగుపరచాలి. డ్రాపౌట్ సమస్య సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మౌలిక అంశాలతో ప్రభావితమై ఉంది. వీటిని పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ సంస్థలు కుటుంబాలు ఉమ్మడి ప్రయత్నం చేయటం అవసరం. సమగ్ర విద్యపై దృష్టి పెట్టడం ద్వారా తెలంగాణలో డ్రాపౌట్ల రేట్లను తగ్గించడానికి వీలవుతుంది.

## ఓటర్ గుర్తింపు కార్డుల తనిఖీలో వివాదం..ఏడుగురు పోలీసులపై ఇసి వేటు

న్యూఢిల్లీ,ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో ఓటర్ గుర్తింపు కార్డుల తనిఖీలకు సంబంధించి బుధవారం నాడు తలెత్తిన వివాదంపై ఎన్నికల కమిషన్ కొరడా ఝళిపించింది. సమాజ్‌వాదీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓటర్ గైడ్‌లైన్స్ ఉల్లంఘనకు పాల్పడిన ఏడుగురు పోలీసులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్టు ఆదేశాలిచ్చింది. సస్పెండైన వారిలో కాన్పూర్, ముజఫర్‌నగర్ జిల్లాలకు చెందిన చెరో ఇద్దరు అధికారులు, మొరాదాబాద్ నుంచి ముగ్గురు అధికారులు ఉన్నారు. అర్హత కలిగిన ఓ ఒక్కరిని ఓటు వేయకుండా అడ్డుకోరాదు. ఓటింగ్ సమయంలో ఎలాంటి వివక్షను సహించేది లేదు. ఫిర్యాదు అందితే వెంటనే విచారణ ఉంటుంది. దోషిగా తేలితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఫిర్యాదులు అందిన తక్షణమే చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారుని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో తెలియజేయాలని కూడా ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, కతెహారి, ఖైర్, కుందర్కి, కర్హాల్, మజవాన్, మీరాపూర్, ఫుల్పూర్, సిసామౌ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం ఉప ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. పోలీసు అధికారులు చట్టవిరుద్ధంగా ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు తనిఖీ చేస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఈసీకి ఫిర్యాదు చేశారు. కొన్ని కమ్యూనిటీలను ఓటు వేయకుండా నిరోధిస్తున్నారని, దీనిపై ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అఖిలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ, చాలాచోట్ల తాము ఫిర్యాదులు చేశామని, ఏమి చేసైనా సరే నెగ్గాలని బీజేపీ

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

అమరావతి,కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు కోసం ప్రక్రియ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా గళంలో ఇచ్చిన హామీ మేరకు హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సర్కార్ పేర్కొంది. ఈ మేరకు సీఎం కార్యాలయం నుంచి న్యాయశాఖకు వచ్చిన లేఖతో ప్రక్రియను న్యాయశాఖ మొదలుపెట్టింది. బెంచ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌కు న్యాయశాఖ కార్యదర్శి సునీత లేఖ రాశారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలు కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి హైకోర్ట్‌లో దాఖలైన కేసులు వివరాలు ఇవ్వాలని న్యాయశాఖ కార్యదర్శి కోరారు. బెంచ్ ఏర్పాటు చేయాలంటే ఈ నాలుగు జిల్లాల నుంచి 1/3 కేసులు ఉండాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర మొత్తం జనాభాలో 4.95 కోట్లు ఉండగా అందులో రాయలసీమలో రీజియన్‌లో 1.59 కోట్ల మంది ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో 25 శాతం మంది ఈ రీజియన్‌లో ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో ఇప్పటికే 7 రాష్ట్రాల్లో హైకోర్ట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారని అధికారులు గుర్తుచేశారు. రాయలసీమ రీజియన్ నుంచి నేరుగా రాజధానికి వచ్చేందుకు రవాణా సౌకర్యం కూడా సరిగా లేదని అధికారులు పేర్కొన్నారు. హైకోర్ట్‌లో ఈ రీజియన్ నుంచి వచ్చిన కేసుల్లో రెండు లేదా మూడు ఏళ్ల కంటే పెండింగ్‌లో ఉన్న వివరాలు కూడా ఇవ్వాలని అధికారులు కోరారు. దీనిపై సమగ్ర సమాచారం ఇవ్వాలని హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌ను న్యాయశాఖ కార్యదర్శి సునీత కోరారు. ఇటీవల న్యాయశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు, మంత్రివర్గ సమావేశంలో దీనిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నట్లు వెల్లడించారు. జూనియర్ న్యాయవాదులకు గౌరవ వేతనం కింద నెలకు రూ.10 వేలు అందిస్తామని చెప్పారు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన ఈ హామీని అమలుచేసే ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

## నన్ను చంపేలా ఉన్నారు.. కాపాడండి..?

అమరావతి,నన్ను చంపేసేలా ఉన్నారు.. కాపాడండి' అంటూ కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, ఎల్లమెల్లికి చెందిన కుమారి అనే మహిళ కువైట్ నుంచి వీడియో విడుదల చేసింది. కువైట్ వెళ్లి అక్కడ పడుతున్న చిత్రహింసలపై రహస్యంగా వీడియో తీసి తన బంధువులకు పంపింది. 'నాకు సరిగా తిండి పెట్టడంలేదు, చంపేసేలా ఉన్నారు.. నన్ను కాపాడి పిల్లల వద్దకు చేర్చాలంటూ' మహిళ కన్నీటి పర్యంతమవుతోంది. గండేపల్లి మండలం, యల్లమిల్లి గ్రామానికి చెందిన కుమారికి 19 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త వెంకటేశ్ ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో సంపాదన చాలక కువైట్ వెళ్లాలని నిర్ణయించుకుని.. పాలకొల్లుకు చెందిన ఎం.సుధాకర్ అనే ఏజెంట్ సహాయంతో కువైట్‌లో ఓ ఇంట్లో పనిమనిషిగా ఉద్యోగంలో చేరింది. కువైట్ వెళ్లిన ఏడు నెలల కాలంలోనే తాను పలు సమస్యలు ఎదుర్కొంటూ, చిత్రహింసలకు గురవు తున్నట్టు వీడియో ద్వారా బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తనను ఎలాగైనా కాపాడాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటోంది. కాగా పొట్ట కూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఎందరో తెలుగువాళ్లు మోసపోతున్నారు. అక్కడ కష్టాల్లో కూరుకుపోతున్నారు. ఇలాంటి బాధితులను ఆదుకునేందుకు మంత్రి నారా లోకేశ్ ఆపన్న హస్తంఅందిస్తున్నారు. వారి చీకటి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సాయం చేస్తున్నారు. తన దృష్టికి వస్తున్న సమస్యలపై వెంటనే స్పందిస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకున్న దాదాపు 20 మందిని స్వస్థలాలకు రప్పించారు. తాము ఇబ్బందుల్లో ఉన్నామని వాట్సాప్, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా మెసేజ్‌లు పంపిన వారికి అండగా నిలిచారు. ప్రభుత్వ పరంగానే కాక టీడీపీకి అనుబంధంగా పని చేసే ఎన్నారై టీడీపీ బృందాలను రంగంలోకి దించి కష్టాల నుంచి గట్టెక్కించారు. ఇలా లోకేశ్ నుంచి సాయం పొందిన బాధితులు.. ముగిసి పోయిందనుకున్న తమ జీవితాల్లో ఆయన వెలుగులు నింపారని అంటున్నారు.

## వాడివేడిగా సాగిన ఏపీ శాసనమండలి

అమరావతి, మదనపల్లె ప్రభుత్వ దస్త్రాల దహనం అంశం శాసనమండలిని కుదిపేసింది. ఈ కేసులో ఎలాంటివారున్నా వదిలిపెట్టేది లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం సభలో మదనపల్లె దస్త్రాల ఘటనకు సంబంధించి టీడీపీ సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై మాట్లాడిన రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి పేరు ప్రస్తావించారు. వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం చోటు చేసుకుంది.విచారణ జరుగుతున్న సమయంలో వ్యక్తుల పేర్లు ఎలా ప్రకటిస్తారని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సభ్యులపై బురద జల్లడం సరికాదన్నారు. రికార్డుల నుంచి ప్రకటించిన వ్యక్తుల పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈలోగా ఛైర్మన్ జోక్యం చేసుకుని సభ్యులను వారించే ప్రయత్నం చేశారు. వ్యక్తుల పేర్లు వెల్లడించకుండా మాట్లాడాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ నోరు విప్పారు. సీఐడీ దర్యాప్తులో ఉన్న అంశాలను తాను ప్రస్తావించానని అన్నారు. మొత్తం 2,400 ఫైళ్లకు నిప్పు పెట్టారని తెలిపారు. ఘటన విషయం తెలియగానే అధికారులు, పోలీసులు అక్కడి వెళ్లారని తెలిపారు మంత్రి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దస్త్రాలు తగలబడినట్టు అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. కుట్ర పూరితంగా ఘటన జరిగినట్టు కనిపించిందన్నారు. సీసీటీవీ కెమెరా అప్పుడు పని చేయకపోవడం, మోటారు ఆయిల్ అక్కడ ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలో సీఐడీ దర్యాప్తుకు ఆదేశించామన్నారు. ఘటనలో కొందరి మాజీ అధికారుల పేర్లు ప్రస్తావించారు మంత్రి అనగాని. వీరంతా మాజీ మంత్రి అనుచరులుగా ఉన్నారని వివరించారు. దీనిపై సీఐడీ లోతుగా విచారణ చేస్తోందని, దాన్ని నిర్ధారించాల్సి వుందన్నారు. మదనపల్లెలో మొత్తం 13, 445 ఎకరాలు ఉండగా, చట్ట ప్రకారం జరిగింది 8,882 ఎకరాలని అన్నారు. చట్ట ప్రకారం కాకుండా 4,500 ఎకరాలని తేల్చి చెప్పారు మంత్రి అనగాని సత్యప్రసాద్. సాక్షాలను బూడిద చేశారన్నారు. అందులో నుంచి అసలు విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. మరోవైపు రుషికొండ ప్యాలెస్ వ్యవహారంపై వైసీపీ డిఫెన్సులో పడిపోయింది. మంత్రుల నుంచి ఎదురుదాడి మొదలుకావడంతో ఏం చెయ్యాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. చివరకు వాటిని వైసీపీ ప్రభుత్వ భవనాలుగా తేల్చేసింది. ప్రభుత్వం మీది.. ఏం చెయ్యాలో చేసుకోండంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు వైసీపీ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ. రుషికొండ ప్యాలెస్ అంశంపై మండలిలో ఎమ్మెల్సీ రామారావు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ సందర్భంగా టూరిజం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. అక్కడ హరిత రిసార్ట్స్ వల్ల ఏడాదికి 7 కోట్లు నుంచి 16 కొట్ల వరకు ఆదాయం వచ్చేదన్నారు.

# స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశావు...



కడప,కడప స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని, పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డి కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఏం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ప్రశ్నించారు.పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డి కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఏం చేశారని నిలదీశారు. టెంకాయలు కొట్టి నిరసన తెలిపారు. బుధవారం కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి నాయకులను ఎన్నుకునే ముందు ఆలోచించుకోవాలని షర్మిల అన్నారు. గత ఐదేళ్లలో స్టీల్ ప్లాంట్ కోసం జగన్ చేసిందేమీ లేదన్నారు. కేవలం టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగానే గత పాలకులు తయారు చేశారన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని, చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. పేద ప్రజల కోసం, కడప ప్రాంత అభివఅద్ధి కోసం వైఎస్సార్ చిత్తశుద్ధితో దీన్ని తీసుకొచ్చారని అన్నారు. 10 వేల ఎకరాల్లో రూ.20 వేల కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ల టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది ఆయన ఆశయమని, దీని ద్వారా 25 వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశముందని చెప్పారు. వైఎస్సార్ చనిపోయిన తర్వాత వచ్చిన నాయకులందరూ స్టీల్ ఎ÷-లాంట్ ఊసే లేకుండా చేశారని విమర్శించారు. సెయిల్ ద్వారానే ప్లాంట్ నిర్మించాలని విభజన హామీల్లో ఉందని గుర్తు చేశారు. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే నిర్మాణం జరిగి ఉండేదన్నారు. ఏపీ పట్ల బిజెపికి చిన్నచూపు ఉందని, ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన హామీలను సైతం ఆ పార్టీ తుంగలో తొక్కిందని షర్మిల ధ్వజమెత్తారు. కడప ప్రాంత అభివఅద్ధికి స్టీల్ ఎ÷-లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమబాట పడుతుందని, అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షకూ సిద్ధం అని షర్మిల అన్నారు. ఇకపోతే సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారిని కఠినంగా శిక్షించాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. తనతో పాటు వైఎస్ విజయమ్మ, సునీతపై పోస్టులు పెట్టించింది వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి అని పోలీసులు నిర్ధరణకు వచ్చారని.. అలాంటప్పుడు ఆయన్ను ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. వైకాపా 'సోషల్ సైకో' వర్రా రవీందర్‌రెడ్డి కేసులో అవినాష్‌ను విచారించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు సజ్జల భార్గవరెడ్డి మూలకారణమన్నారు. ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అసభ్య పోస్టుల వెనక ఎంత పెద్ద తలకాయలు ఉన్నా.. ఏ ప్యాలెస్‌లో దాక్కున్నా పోలీసులు వదిలిపెట్టవద్దు. పోస్టులు పెట్టిన వారిని మాత్రమే పోలీసులు పట్టుకుంటున్నారు. వారి వెనకున్న వారిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. తెర వెనకున్న వారిని వదిలేస్తే న్యాయం జరగదు. 33శాతం మహిళలు అసెంబ్లీలో ఉండాలని నిత్యం చెప్పే వారే సోషల్ మీడియా వేదికగా అసభ్య ప్రచారం చేయడం దుర్మార్గం అన్నారు. సమాజంలో మహిళలు ఎదగకూడదనే ఇలాంటి దాడులు చేస్తున్నారు. వివేకా హత్య కేసులో సునీతకు అండగా ఉంటాను. ఆ కేసులో అసలు దోషులెవరో కనిపెట్టి శిక్షించాలని షర్మిల డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ వ్యాఖ్యలపై దాసోజు కౌంటర్



హైదరాబాద్,కేసీఆర్ మొక్క కాదు.. ఓ ఉద్యమ వృక్షం.. ప్రజల కల్పవృక్షం అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. కానీ రేవంత్ రెడ్డి తులసీవనంలో గంజాయి మొక్కలా మారారని విమర్శించారు. మహారాష్ట్ర ఫలితాల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పదవి ఊడటం ఖాయమని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా రేవంత్ అదానీతో కలిసి పోయారని విమర్శించారు.రేవంత్ రెడ్డి పదవి ప్రమాదంలో పడిందని, అందుకే ఈ అసహనమని దాసోజు శ్రవణ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్ స్టార్‌గా, పరేషాన్ రెడ్డిగా మారి కేసీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళలకు పెన్షన్లు పెంచలేనోడు, తులం బంగారం ఇవ్వలేనోడు.. కోటి మందిని కోటీశ్వరులను చేస్తాననడం.. పుండుకు సమరు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె కావాలన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సోనియా కాళ్లు కడిగి నెత్తిన పోసుకుంటానని రేవంత్ రెడ్డి అంటున్నారని తెలిపారు. 'నీ లాంటి చిచోరా వ్యక్తికి సీఎం పదవి ఇచ్చినందుకు సోనియా కాళ్లు కడిగిన నీటిని తీర్థం తాగినట్టు తాగినా తప్పు లేదు' అని విమర్శించారు.రేవంత్ రెడ్డి తెలంగాణ పాలిట శాపంలా మారారని దాసోజు శ్రవణ్ విమర్శించారు. రేవంత్ రాజకీయాలను చిల్లర మల్లరగా మార్చారని ధ్వజమెత్తారు. తొక్కుతా, చంపుతా, పీకుతా.. పేగులు మెడలు వేసుకుంటా అని సీఎం పదవిలో ఉండి ఎవరైనా మాట్లాడతారా అని నిలదీశారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసే వాళ్లు మాట్లాడే మాటలేనా ఇవి అని ప్రశ్నించారు. కేవలం పిచ్చి పట్టిన వాళ్లే రేవంత్‌లా మాట్లాడతారని మండిపడ్డారు. రేవంత్ భాషను మంత్రి వర్గంలో ఉన్న ఉత్తమ్, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ లాంటి వాళ్లు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌తో రేవంత్ అభివృద్ధిలో పోటీ పడాలి, తలసరి ఆదాయం పెంచడంలో పోటీపడాలని అని సూచించారు. 'రేవంత్.. దమ్ముంటే రాష్ట్రంలో బెల్ట్ షాపులు బంద్‌చేయి. నీ ఫొటోకు పాలాభిషేకం చేస్తా. నీకు బహిరంగంగా దండం పెడతా' అని సవాలు విసిరారు. కేసీఆర్‌పై దూషణల మీద పెట్టే శ్రద్ధ పాలన మీద పెట్టు రేవంత్ అని హితవు పలికారు.

# నోటీసులు ఇచ్చారు.. చర్యలు మరిచారు..!

ఆసిఫాబాద్,అసిఫాబాద్ పట్టణానికి ఆనుకొని ఉన్నటువంటి ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలోని బీడీపీపీ భూముల్లో అక్రమ కొనుగోలు అమ్మకాలు జరుగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండానే భారీ భవనాలు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు రెవెన్యూ కార్యాలయాలకు వస్తున్నాయి. పలు వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలకు రెవెన్యూ అధికారులు స్పందించి ఐదుగురి వ్యక్తులకు బీడీపీపీ భూముల్లో భవనాలు నిర్మించిన వారికి నాలా కబ్జా చేసి చదును చేసిన వ్యక్తికి తహసీల్దార్ నోటీసులు ఇచ్చారు. నోటీసులకు వారంలోగా సమాధానాలు ఇవ్వాల్సిందిగా కోరగా%ౌ% కేవలం ఒకే వ్యక్తి సమాధానం ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. నాలా చదును చేసిన వ్యక్తికి చెందిన స్థలంలో జేసీబీలతో నాలాలో మట్టిని తొలగించారు. ఒకరోజు హడావుడి చేసిన అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కొన్ని రోజుల పాటు హడావుడి చేసే అధికారులు విషయాన్ని మరిచిపోతున్నారు.ఈ అక్రమాలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం కొద్ది రోజులపాటు హడావుడి చేసినట్లు కనిపిస్తుంది. బీడీపీపీ భూముల్లో స్థలాలు కొనుగోలు చేసి, ఎటువంటి అనుమతులు లేకుండా భారీ భవనాలు నిర్మాణాలు చేస్తున్నప్పటికీ వీరికి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని పలు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం, మంచినీటి సరఫరా, తదితర సౌకర్యాలు అధికారులు ఎలా కల్పిస్తున్నారని స్థానికులు



ఆశ్చర్యానికి గురవుతున్నారు. అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ కొంతమంది ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదు.అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటా.. రోహిత్ దేశ్ పాండే, తహసిల్దార్ ఆసిఫాబాద్‌ఆసిఫాబాద్ పట్టణంలోని చెక్ పోస్ట్ సమీపంలో బీడీపీపీ, అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. గతంలో వారికి నోటీసులు జారీ చేశాం. ఐదు రోజుల సమయం ఇవ్వాలని వారు మౌఖికంగా కోరారు. మరోసారి నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. బీడీపీపీ, అసైన్డ్ భూములు అమ్మరాదు.. కొనరాదు.. ఇది చట్ట విరుద్ధం. ఇలాంటి భూములను అమ్మిన, కొన్న వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు.

# జార్ఖండ్‌లో ఎన్డీఏకే విజయావకాశాలు

జార్ఖండ్, ఖనిజ సంపదకు నిలయమైన జార?ండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎన్డీఏ, 'ఇండియా' కూటములకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 24 జిల్లాలు, ఐదు డివిజన్లు ఉన్న జార్ఖండ్‌లో 81అసెంబ్లీ స్థానాలున్నాయి. ఉత్తర భారత దేశంలోనే అధికంగా ఆదివాసీల ప్రాబల్యం ఉన్న రాష్ట్రం జార?ండ్. జెఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐఎంఎల్ పార్టీలతో కూడిన 'ఇండియా' కూటమి, బిజెపి, ఎజెఎస్‌యు, జేడీ(యూ), ఎల్‌జీపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో పోటాపోటీగా తలపడ్డాయి. ఖండ్‌లో ప్రస్తుతం జెఎమ్ఎం అనుమతిని 'ఇండియా' కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలపై క్షేత్రస్థాయిలో పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ ఎగ్జిట్ పోల్ నిర్వహించింది.ఎగ్జిట్ పోల్‌లో బిజెపిని ఎన్డీఏ జార?ండ్‌లో అధికారం చేపట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 81 శాసనసభ స్థానాలున్న జార?ండ్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ సీట్లు 41. బిజెపి (42 నుండి 48 స్థానాలు), ఎజెఎస్‌యు (25), కాంగ్రెస్ (814), జెఎంఎం (1623), ఇతరులు (610) స్థానాలు పొందే అవకాశాలున్నాయని ఎగ్జిట్ పోల్ సర్వేలో ఉంది.పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాల ప్రకారం బిజెపి 42.1 శాతం, ఎజెఎస్‌యు 4.6 శాతం, కాంగ్రెస్ 16.2 శాతం, జెఎంఎం 20.8 శాతం, ఇతరులు 16.3 శాతం ఓట్లు పొందుతున్నారు. ఈ సర్వే ఫలితాల్లో మూడు శాతం ప్లస్ ఆర్ మైనస్‌లు ఉన్నాయి.రాష్ట్రంలో డివిజన్ల వారీగా పార్టీల బలబలాలను అంచనా వేస్తే.. కొల్హాన్ డివిజన్‌లో 2019 ఎన్నికల్లో జెఎంఎం అధికారం సాధించగా, ప్రస్తుతం బిజెపి మెరుగ్గా కనిపిస్తున్నా 'ఇండియా' కూటమి ఇక్కడ గట్టి పోటీ ఇచ్చింది. బొగ్గు మైనింగ్ అధికంగా ఉండే నార్త్ చోట నాగపూర్‌లో ఎస్సీ జనాభా అధికం. ఇక్కడ వామపక్షాలకు కొంత బలమున్నా, పట్టణ ప్రాంతాలకు బిజెపికి సానుకూలంగా ఉంది. కుర్మి సామాజికవర్గం ఇక్కడ అధికంగా ఉండటంతో ఎజెఎస్‌యు కూడా బలంగానే ఉంది. సీపీఐఎంఎల్ ఇక్కడ కీలకం కావడంతో, ఈ ప్రాంతంలో రెండు కూటముల మధ్య గట్టి పోటీ ఉంది. సౌత్ చోటా నాగపూర్ రీజియన్‌లో రాజధాని రాంచీ కీలకం. ముండా, ఓరన్‌లో ఎస్టీలు, లోహర్‌గడ్‌లో ముస్లింలు, సిండేగాలో క్రిస్టియన్ల ప్రభావం ఉంది. రాంచీ, గుమ్లా జిల్లాలో బిజెపికి సానుకూలంగా ఉండగా, ఈ ప్రాంతంలోని ఇతర జిల్లాల్లో పోటాపోటీగా



ఉంది. ఓబిసిలు అధికంగా ఉండే పాలాం ప్రాంతంలో గతంలో మెరుగైన ఫలితాలు పొందింది. ఈ సారి కూడా అదే పునరావృతమయ్యే అవకాశాలున్నాయి. సంతల పరగాన ప్రాంతంలో గతంలో బిజెపికి అనుకూల ఫలితాలు రాలేదు.

ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయి.

ఎస్టీ సామాజికవర్గంలో సంతాల వర్గం కీలకం. సీఎం హేమంత్ సోరెన్, బీజేపీ సీనియర్ నేత బాబులాల్ మరాండీ సంతాల వర్గానికే చెందిన వారు. ప్రస్తుతం ఈ సామాజికవర్గంలో బిజెపితో ప్రస్తుత జెఎంఎంకు కొంత అనుకూలంగా ఉంది. ముండా సామాజికవర్గం బిజెపి వైపు ఉండగా, ఓరన్ సామాజికవర్గం బిజెపి, కాంగ్రెస్ మధ్య చీలిపోయింది. హెూ సామాజికవర్గం బిజెపికి అనుకూలంగా ఉంది. ఎస్సీ సామాజికవర్గంలో పాశ్వాన్, బోక్తా పార్టీలకు అనుకూలంగా ఉండగా, చమర్ వర్గం 'ఇండియా' కూటమి వైపు ఉంది. ఓబిసిలో కుర్మి సామాజికవర్గం కీలకం. గతంలో వీరు జెఎంఎంకు అనుకూలంగా ఉండగా, ప్రస్తుతం ఎజెఎస్‌యు వైపు ఉన్నారు. మరో సామాజికవర్గం బనియా బిజెపి వైపు ఉన్నారు. యాదవులు ఎన్‌డిఎ, 'ఇండియా' కూటమి మధ్య చీలి ఉన్నారు. 14 శాతంపైగా ఉన్న ముస్లింలు, 4 శాతంపైగా ఉన్న క్రైస్తవులు 'ఇండియా' కూటమికి అనుకూలంగా ఉన్నారు. అగ్రవర్ణాల్లో బ్రాహ్మణులు, రాజపుత్రులు, కాయస్తులు బిజెపికి అనుకూలంగా ఉన్నారు.

# గోదారి ఒడిలో గండి పోచమ్మ...



దేవీపట్నం, కార్తీక మాసంలో అటు ఆధ్యాత్మిక శోభ.. ఇటు సామూహిక వన భోజన సందడి. ఆ బాల గోపాలం ఆటపాటల కేరింతల హేళి. వన విహారం మరుపురాని మధురానుభూతి. ఇవ్వనీ సరే.. ఉరుకు పరుగుల గోదారమ్మ పాపికొండల నడుమ గుంభనంగా.. ప్రశాంతంగా జల పరుపు పరిస్తే.. లాహిరి లాహిరి అంటూ తన్మయంతో లాంచీ యానంలో మైమరచిపోయే పర్యాటక జనం.. మరో మహత్తర సన్నివేశాన్ని మిస్ కాకుడదనుకుంటారు. అదే మాతృశ్రీ గండి పోచమ్మ దర్శన భాగ్యం.

ఆరు నెలలపాటు..

భక్తుల పాలిట కొంగు బంగారమై.. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా గండి పోచమ్మ తల్లి పేరుగాంచింది. అమ్మ దర్శనం చేసుకుని.. ఆ తర్వాత పాపికొండల్లో జల విహార యాత్రలో ఆనంద పరవశంలో మునిగి తేలి.. అడవి తల్లి ఒడిలో వన భోజనాల జాతరలో సందడి చేయని పర్యాటకులు ఉండరు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నేపథ్యంలో.. కృష్ణమ్మ ఒడిలో సంగమేశ్వర ఆలయ చరిత్రను గోదారమ్మ పొత్తిళ్లలో గండిపోచమ్మ ఆలయం నవ చరిత్ర సృష్టిస్తోంది. ఆరుమాసాల జల దిగ్బంధనం నుంచి పోచమ్మ తల్లి తేరుకుని భక్తులకు దర్శనం ఇవ్వబోతోంది. బుధవారం నుంచే భక్తులకు దర్శన బాగ్యం కలగనుంది..

మరో సంగమేశ్వరం..

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పూడిపల్లి పంచాయతీ గొందూరు గ్రామంలో వేంచేసిన గండి పోచమ్మ తల్లి ఆలయం గోదావరి తీరంలోనే ఓ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఇప్పటి వరకూ గోదావరి ఒడ్డున పుణ్యక్షేత్రంగా వెల్లివిరిసిన ఈ పుణ్యక్షేత్రం భవిష్యత్తులో.. మరో సంగమేశ్వర పుణ్యక్షేత్రంగా మారబోతోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాగానే.. ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ఈ ఆలయం నిమజ్జనం కానుంది. ఇదే విషయాన్ని ఈ ఏడాది వరదలు నిరూపించాయి. గోదారి వరద పరవళ్లతో ఆలయం తెరుచు కోలేదు.

గోదారి ప్రవాహం తగ్గడంతో..

వరద నీటిలో పోచమ్మ ఆలయం మునిగిపోయింది. రహదారులు జలదిగ్బంధనం అయ్యాయి. భక్తులకు దర్శనం నిలిపివేశారు. పోచమ్మ తల్లి ఆలయంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు గోదావరి వరద నీటిలో మునిగిపోగా ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గం జలదిగ్బంధనంలో చిక్కుకుంది. ఈ కారణాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అప్పట్లో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు గోదావరి నీటిమట్టం భారీగా తగ్గింది. ఆలయం పూర్తిగా వరద నీటి నుంచి బయటపడడంతో అధికారులు ఆలయ సంప్రోక్షణ చేశారు. ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్లు ప్రయాణానికి అనుకూలంగా ఉన్నాయి. గండి పోచమ్మ తల్లి దర్శనం కోసం భక్త జనం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు.

పకడ్బందీ భద్రత ఏర్పాట్లు

ఆది, మంగళవారాల్లో విశేష సంఖ్యలో పోచమ్మ తల్లి దర్శనానికి తరలి వస్తారు. ఈ స్థితిలో ఆలయం వద్ద ప్రత్యేక భద్రత, రక్షణ ఏర్పాట్లు చేసినట్టు దేవస్థాన అధికారులు చెప్పారు. ఇంకా గోదావరిలో నీటిమట్టం ఎక్కువగానే ఉందని, భక్తులు ఎవరు నది లోపలికి దిగి స్నానాలు చేయవద్దని సూచించారు. దేవస్థానం తరుపున ఏర్పాటు చేసిన స్నాన ఘట్టం వద్ద మాత్రమే స్నానాలు చేయాలని, ఇతర రేవుల్లో స్నానాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

నేటి నుంచి దర్శన భాగ్యం..

బుధవారం నుంచి గండి పోచమ్మ తల్లి దర్శనాలకు ఏర్పాటు చేసినట్టు.. భక్తులు దర్శించు కోవచ్చని అధికారులు తెలిపారు. గోకవరం నుంచి ఇందుకూరు పేట, పోతవరం, దండంగి మీదుగా అమ్మవారి ఆలయానికి వాహనాల్లో రావొచ్చని తెలిపారు. రాజమండ్రి మీదుగా వచ్చే భక్తులు పురుషోత్తపట్నం మీదగా రావచ్చని భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ అధికారులు తెలియజేశారు.

ఇక సందడే సందడి

అల్లూరు జిల్లా, రంపచోడవరం ఏజెన్సీ దేవీపట్నం మండలంలోని గోందూరు గ్రామంలో వెలిసిన మాతృశ్రీ గండి పోచమ్మ ఆలయ తలుపులను ఆరు నెలల తర్వాత తెరిచారు.. కార్తీక మాసం కావడం పాపికొండల పర్యటన ఇక్కడి నుంచే మొదలవతుంది. అటు పాపికొండల యాత్ర.. ఇటు గండిపోచమ్మ దర్శనంతో.. ఈ కార్తీక మాసంలో పర్యాటక జనం సందడే సందడి.

## తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

తమిళనాడు ,ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నై సహా తూత్తుకుడి, తిరునల్వేలి, తిరువావూరు, నాగపట్నం, కరైకల్ సహా పలు జిల్లాల్లో రాత్రి నుంచి ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా ఐదు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా.. రామనాథ పురం,తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్కాసి, తిరువారూరు జిల్లాల్లో ఈరోజు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మరోవైపు కన్యాకుమారి జిల్లాలోని కన్యాకుమారి, పేచిపరై ప్రాంతాల్లోనూ విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు.

# ఉగ్రవాదిలా అరెస్ట్ చేస్తారా?




హైదరాబాద్,లగచర్ల దాడి ఘటనలో కింది కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను క్వాష్ చేయాలంటూ మాజీ ఎంఎల్ఎ పట్నం నరేందర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై వాదనలు బుధవారం ముగిశాయి. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. పోలీసుల రిమాండ్ రిపోర్టును పరిగణలోకి తీసుకున్న కొడంగల్ కోర్టు నిబంధనలకు విరుద్ధంగా రిమాండ్ విధించిందని ఈ ఉత్తర్వులను కొట్టి వేయాలని పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి కె.లక్ష్మణ్ విచారణ జరిగింది. నరేందర్ రెడ్డి సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు వాదనలు వినిపించారు. పోలీసులు దాఖలు చేసిన మొదటి రిమాండ్ రిపోర్టులో పట్నం నరేందర్ రెడ్డి పేరు లేదని, నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రెండో రిమాండ్ రిపోర్టులో నరేందర్ రెడ్డిని ఎ1గా చేర్చినట్లు పోలీసులు చెబుతున్నారని న్యాయవాది కోర్టుకు ఉంది. అధికారులపై దాడికి కుట్ర పన్నారని, ప్రజలను రెచ్చగొట్టినట్లు నరేందర్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు,దీనికి ఎలాంటి ఆధారాలు లేవని వాదించారు. దాడిలో పాల్గొన్న సమయంలో సురేశ్‌తో నరేందర్ రెడ్డి వందల సార్లు ఫోన్‌లో మాట్లాడేందుకు ఎలాంటి ఆధారాలు లేవని, 71 రోజుల వ్యవధిలో 84 సార్లు మాట్లాడినట్లు పోలీసులు నివేదికలో పేర్కొన్నారు. పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని కుటుంబ సభ్యులకు సమాచారం కూడా ఇవ్వలేదు. సుప్రీం తీర్పు కింది కోర్టు పరిగణలోకి తీసుకోలేదని, అరెస్ట్ గ్రౌండ్స్ చూడకుండానే నరేందర్ రెడ్డికి న్యాయస్థానం రిమాండ్ విధించిందని న్యాయవాది వివరించారు. పోలీసులు కోరుతూ కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. తమకు కావాల్సిన విధంగా రాసు కొని కన్ఫెషన్ రిపోర్టుగా చూపిస్తున్నారని కోర్టుకు నివేదించారు.బిఆర్ఎస్ నేత రూపొందించిన విధంగా దాడికి పాల్పడినట్లు నరేందర్‌రెడ్డి వాంగ్మూలం ఇచ్చారని పోలీసులు ఎలాంటి వాస్తవాన్ని అందించారు. ఈ మేరకు నరేందర్ రెడ్డి, సంబంధిత కోర్టుకు అఫిడవిట్ కూడా సమర్పించారు. ఫార్మా విలేజ్ కోసం భూసేకరణ చేపట్టే కార్యక్రమం పట్నం నర రెడ్డి బహిరంగంగా వ్యతిరేకించడంతో పాటు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు ఏర్పాటు చేశారు. ప్రభుత్వంలో అస్థిరత సృష్టించాలన్నదే నరేందర్ రెడ్డి కుట్ర అని ఆయన వాదించారు. కేసు దర్యాప్తు దశలో ఉందని, ఇప్పుడు నరేందర్ పిటిషన్‌ను అనుమతిస్తే విచారణపై ప్రభావం చూపుతుందని పిపి వాదించారు. నరేందర్ రెడ్డి అరెస్ట్ చేసిన తీరును హైకోర్టు తప్పు పట్టింది. అతను ఏమైనా టెర్రరిస్టా అని సీరియస్ అయింది. మాజీ ఎంఎల్ఎను కెబిఆర్ పార్కు వద్ద ఓ ఉగ్రవాదిలా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించారు. ఆయన ఏమైనా అజ్ఞాతంలోకి వెళ్లాడా? అని పిపిని న్యాయమూర్తి అడిగారు. దాడికి గురైన అధికారులకు తగిన గాయాలేమోనని వైద్యులు నివేదిక ఇచ్చారని, పోలీసులేమో తీవ్ర గాయాలుగా ఉన్నట్లు తెలుస్తోంది.లక్ష్మణ్, దేవేందర్, హన్మంత్ ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా నరేందర్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా చేర్చినట్లు పోలీసులు నిర్ధారించారు, ఆ ముగ్గురి వాంగ్మూలాలు కోర్టుకు సమర్పించాలని పిపిని కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు పట్నం నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలు నుంచి కస్టడీ పటిషన్ నిమిత్తం కొడంగల్ కోర్టుకు తీసుకెళ్లారు. నరేందర్ రెడ్డిని కొడంగల్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో ఆయన అభిమానులు పెద్ద ఎత్తున కోర్టు వద్దకు చేరుకున్నారు. పట్నంకు మద్దతుగా సిఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్నం సతీమణి సహా కుటుంబ సభ్యులు కూడా ఆయనను చూసేందుకు కోర్టుకు వచ్చారు. కొడంగల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ఆయనను హాజరుపరిచారు. కస్టడీ పిటిషన్‌పై ఇరువర్గాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించిన వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈ నెల 22కు రిజర్వ్ చేశారు. అనంతరం పట్నం నరేందర్‌రెడ్డిని తిరిగి చర్లపల్లి జైలుకు తరలించారు.

## రసాయన పరిశ్రమలో ప్రమాదం

హైదరాబాద్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని అరోరా ఫార్మా కంపెనీలో ఈ ఉదయం రసాయన ప్రమాదం చోటుచేసుకుంది. బాయిలర్ శుభ్రం చేస్తుండగా రియాక్టర్‌లో రసాయన రియాక్షన్ కారణంగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కార్మికుడు అనిల్ (40) మృతి చెందగా, గోపి (23), శ్రీనివాస్ (25), బలరామ్ (30) అనే ముగ్గురు ఇతర కార్మికులు తీవ్ర గాయాల పాల య్యారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై యాజమాన్యంపై నిర్లక్ష్యానికి సంబంధించిన ఆరోపణలు వస్తున్నాయి, దీంతో కార్మికులు, కుటుంబ సభ్యులు కంపెనీ ముందు నిరసన ప్రదర్శించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com